www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
మంగళవారం 28 జనవరి 2025
సంపుటి :06 సంచిక : 240 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## నాగోబా జాతర సందర్భంగా గిరిజనులకు సీఎం శుభాకాంక్షలు

( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో. జనవరి 27:** దేశంలోనే రెండో అతి పెద్ద గిరిజన జాతరైన నాగోబా జాతర సందర్భంగా భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మెస్రం వంశస్థుల ఆధ్వర్యంలో జరిగే నాగోబా జాతరను అయిదు రోజుల పాటు వేడుకగా సాగుతుందని, భక్తులు నాగోబాను దర్శించుకొని ఆశీస్సులు అందుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అధికారికంగా నిర్వహిస్తున్న జాతరకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.



## నాగోబా జాతర ప్రారంభ మహా పూజ కార్యక్రమం

- గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సురేఖ





( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 27:** ఆదిమ గిరిజనుల ప్రాచీన సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నాగోబా జాతర

మిగతా2లో..



# తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రికార్డు

- ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభం
- 6,15,677 మంది అర్హులకు లబ్ది
- రైతు భరోసా, ఆత్మీయ భరోసాకు రూ. 579 కోట్లు విడుదల

**హైదరాబాద్,జనవరి27( వెలుతురు):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మరో రికార్డు నెలకొల్పింది. ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాలను విజయవంతంగా ప్రారంభించటంతో పాటు.. అక్కడికక్కడే 6,15,677 మంది అర్హులకు లబ్ది కల్పించింది. అదే రోజున రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఆర్థికశాఖ రూ. 579 కోట్లు విడుదల చేసింది. లక్షలాది మంది రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాల్లో ఈ నిధులు జమ కావటంతో రాష్ట్రమంతటా ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్ర ప్రభుత్వం



ముందుగా ప్రకటించిన విధంగానే ప్రజా పాలనలో నాలుగు సంక్షేమ పథకాలు

మిగతా2లో..



## మంద కృష్ణ మాదిగ కు పద్మశ్రీ అవార్డు రావడం సంతోషం

\- ఏ.రాజేష్ యాదవ్

**వెలుతురు, హైదరాబాద్, జనవరి 27:** ఎంఆర్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కు పద్మ శ్రీ అవార్డు రావడం సంతోషంగా ఉందని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ కోశాధికారి ఏ. రాజేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు, మంద కృష్ణ మాదిగ అనేక సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తున్న వ్యక్తి కి పద్మ శ్రీ అవార్డు రావడం సంతోషంగా ఉందని రాజేష్ యాదవ్ తెలిపారు, వికలాంగులకు, వితంతు పెన్షన్ కోసం మంద కృష్ణ మాదిగ పోరాటాలు మరువలేనివని రాజేష్ యాదవ్ పేర్కొన్నారు,

# ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక

- వీరి భాగస్వామ్యం లేకుండా అభివృద్ధిని ఊహించలేం
- ఎన్‌సిసి ర్యాలీలో ప్రధాని మోడీ ఉద్ఘాటన



**న్యూఢిల్లీ,జనవరి27( వెలుతురు):** ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక వహిస్తోందని, వీరి భాగస్వామ్యం లేకుండా ప్రపంచాభివృద్ధిని ఊహించలేమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దశాబ్దాలుగా దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలను తొలగించేందుకు తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఢిల్లీలోని కరియప్ప గ్రౌండ్స్‌లో సోమవారంనాడు జరిగిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ర్యాలీలో ప్రధాని పాల్గొన్నారు. ఎన్‌సీసీ

మిగతా2లో..

# కేంద్ర పథకాలపేర్లు మార్చితే ఊరుకోం



- కేంద్రమే నేరుగా లబ్దిదారులకు సంక్షేమ ఫలాలను అందించేందుకు రడీ...
- పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ అన్యాయం చేయబోం
- రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఏ పేరు పెట్టుకున్నా నో ప్రాబ్లం
- వాళ్లకు ఇష్టమైతే ఒసామా బిడ్ లాడెన్, దావూద్ పేర్లు పెట్టుకున్నా అభ్యంతరం లేదు
- రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుండి డబ్బు తెచ్చి ఖర్చు చేస్తున్నారా?
- పద్మ అవార్డుల జాబితా పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్త తీసుకోవాలి
- ఎంతో మందిని నక్సల్స్ తో చంపించిన గద్దర్ కు అవార్డు ఎట్లా ఇస్తాం?
- ప్రజాస్వామ్య బద్దంగా పోరాడిన వందల మంది బీజేపీ కార్యకర్తలను చంపించిన వ్యక్తి గద్దర్
- తెలంగాణ సెంటిమెంట్ ను మళ్లీ రెచ్చగొట్టి లాభపడాలనుకుంటున్నారు
- ప్రజలకు వాస్తవాలన్నీ అర్థమైనయ్...
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు...

హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు...

**హైదరాబాద్ వెలుతురు జనవరి 27:** కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోమారు స్పష్టం చేశారు. ఒకవేళ కేంద్ర సంక్షేమ పథకాల పేర్లు మార్చితే మాత్రం ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వంతో ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తుందని స్పష్టం చేశారు. పరిస్థితి అంతవరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ అన్యాయం చేయబోమని ఉద్ఘాటించారు. పద్మ అవార్డులకు ప్రతిపాదించే వారి విషయంలో రాష్ట్ర

మిగతా2లో..



# కులగణన పూర్తి చేశారు.... రిజర్వేషన్లు పెంచడానికి జాప్యం ఎందుకు ?

- అసెంబ్లీలో బిల్లు పెట్టి రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్.
- రాజ్యసభ సభ్యులు అధ్యక్షులు జాతీయ బి.సి సంక్షేమ సంఘం ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ వెలుతురు జనవరి 27:** బీసీ కులగణన పూర్తి చేశారు. దాదాపు 55 శాతం జనాభా ఉన్నట్లు తెలిసింది. రిజర్వేషన్లు పెంచడానికి జాప్యం ఎందుకు? కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం పెంచాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ప్రశ్నించారు. త్వరలో జరుపుతామంటే పెంచడానికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. మొదట అసెంబ్లీలో రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో బిల్లు పెట్టి పాస్ చేయాలని సూచించారు.

జనాభా లెక్కలు యున్నవి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు ఉంది ఇంకా అసెంబ్లీలో చట్టం చేస్తే ఇంకా చట్టపరమైన న్యాయపరమైన అవరోధాలు ఉండమన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, వార్డు మెంబర్లలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి

మిగతా2లో..

## రూ.67 వేల కోట్లు అప్పలతో దివాళా తీయించారు

- అప్పులు చేసి దుబారా చేసిన జగన్ ప్రభుత్వం
- అప్పలకు వడ్డీకట్టలేని దుస్థితిలో ఆర్థిక పరిస్థితి
- ఆర్థిక పరిస్థితి బాగోలేకపోతే పన్నుల భారం తప్పదు
- నీతి ఆయోగ్ నివేదికపై మీడియా సమావేశంలో చంద్రబాబు



మిగతా2లో..

# కండువా మార్చేది లేదు.. స్వతంత్రంగానే కొనసాగుతా ..

- టీయుడబ్ల్యూజే మీట్ ది ప్రెస్ లో మంద కృష్ణ మాదిగ వెల్లడి

**హైదరాబాద్ వెలుతురు జనవరి 27:** వర్గీకరణను జీర్ణించుకోలేక పోతున్న కొన్ని శక్తులు పథకం ప్రకారం తనపై రాజకీయ ముద్ర మోపి, లక్షలాది మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారని, వర్గీకరణ అమలయ్యేంత వరకు తాను పోరాడుతూనే ఉంటానని, భవిష్యత్తులో కూడా ఏ రాజకీయ పార్టీ కండువా కప్పుకునేది లేదని, స్వతంత్రంగానే తన కార్యకలాపాలు కొనసాగిస్తానని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితీ .

మిగతా2లో..



(మొదటి పేజీ తరువాయి..)

## నాగోబా జాతర ప్రారంభ మహా పూజ కార్యక్రమం

ఉత్సవాలకు ప్రారంభ సూచకంగా నిర్వహించేమహాపూజను పురస్కరించుకుని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. నాగోబా జాతరను పురస్కరించుకుని గిరిజనులు అత్యంత నిష్టతో ఆచరించే పూజా విధానం గొప్పదని మంత్రి కొండా సురేఖ అన్నారు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 4 వరకు 8 రోజుల పాటు ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ లో నిర్వహించే ఆదిశేషుని నాగోబా జాతర దేశంలోనే రెండో అతిపెద్ద గిరిజన జాతర కావడం తెలంగాణకు ప్రత్యేకతను తెచ్చిపెట్టిందని మంత్రి సురేఖ అన్నారు. దేశంలోని వేర్వేరు రాష్ట్రాల నుంచి జాతరకు తరలి వచ్చే గిరిజన భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని మంత్రి తెలిపారు. నాగోబా దయతో రాష్ట్రం పాడిపంటలతో వర్ధిల్లాలని, సదా శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు.

### సరస్వతి నది పుష్కరాలకు 25 కోట్లు మంజూరు: మంత్రి సురేఖ

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం క్షేత్రంలో ఈ యేడాది మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతి నది పుష్కరాలకు ఏర్పాట్ల కోసం అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ రూ. 25 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్వర్వులిచ్చారు. సరస్వతీ నది పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వచ్చే పరిస్థితుల నేపథ్యంలో భక్తులకు మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు, స్నాన ఘట్టాల నిర్మాణం, రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం తదితర పనులను పకడ్బందీగా చేపట్టాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ లను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనులు చేపట్టి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని మంత్రి సురేఖ సూచించారు. రాష్ట్ర ఏర్పాటుకు పూర్వం 2013లో వచ్చిన సరస్వతీ నది పుష్కరాలను కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్వహించిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో గతంలో కంటే మిన్నగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా, అత్యంత వైభవోపేతంగా సరస్వతీ నది పుష్కరాలను నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక

డవలప్‌మెంట్‌కు గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పనితీరు తనకు చాలా సంతృప్తిని ఇచ్చిందని మోదీ అన్నారు. 170 సరిహద్దు ప్రాంతాలు, సుమారు 100 తీరప్రాంత సరిహద్దులకు ఎన్‌సీసీ క్యాడెట్లు విస్తరించారని, తద్వారా ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి ఎంతో ప్రయోజనం చేకూరిందని చెప్పారు. 'ఒకే దేశం ఒకే ఎన్నికలు'పై డిబేట్‌ను ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు కొనసాగించాలని, దేశ యువత భవిష్యత్తుకు ఏకకాలంలో ఎన్నికలు కీలకమని అన్నారు. ప్రతి నెలలోనూ ఎన్నికలు జరుగుతూ పోతుంటే కాలేజీలు, విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు సమయం ఎక్కడ దొరుకుతుందని ప్రశ్నించారు. వికసిత్ భారత్' ఉద్దేశాలపై ఎన్‌సీసీ క్యాడెట్లతో సహా దేశ యువత దృష్టిసారించాలని మోదీ కోరారు. దేశ వికాశంతోనే భారత్ అంతర్జాతీయంగా ఉన్నత స్థాయికి చేరుకుంటుందన్నారు. 2014లో 14 లక్షల మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 20 లక్షలకు చేరుకుందని, వీరిలో 8 లక్షల మందికి పైగా మహిళలే ఉండటం గర్వకారణమని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫార్మ్‌డ్ యూత్ ఆర్గనైజేషన్‌గా ఎన్‌సీసీ నిలవడం, డిజాస్టర్ మేనేజిమెంట్‌తో సహా అన్ని రంగాలకు ఎన్‌సీసీ సేవలు విస్తరిస్తుండటం ముదావహమని చెప్పారు.

## కండువా మార్చేది లేదు.. స్వతంత్రంగానే కొనసాగుతా ..

వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజె) ఆధ్వర్యంలో సోమవారం 'లక్ష డప్పులు - వేల గొంతుల' కార్యక్రమంపై మీట్ ది ప్రెస్ నిర్వహించారు. టియుడబ్ల్యూజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ మీట్ ది ప్రెస్ కు సమన్వయ కర్తగా వ్యవహరించగా ,టియుడబ్ల్యూజె ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు మంద కృష్ణమాదిగ సమాధానమిచ్చారు. సుప్రీం కోర్టు తీర్పును కూడా రాష్ట్రంలో గౌరవించక పోవడం విచారకరమన్నారు. ఎస్ సి వర్గీకరణను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారన్నారు. వర్గీకరణను అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఆర్డినెన్స్ తీసుకొచ్చి, దేశంలోనే తెలంగాణ మొట్టమొదలుగా అమలు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వర్గీకరణను అమలు చేయకుండా కాంగ్రెస్ మాల సామాజికవర్గం ప్రజా ప్రతినిధులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ను శాసిస్తున్న మాల సామాజిక వర్గం వత్తిళ్లకు తలొగ్గిన సిఎం రేవంత్ రెడ్డి వర్గీకరణను అమలు చేయడం లేదన్నారు. అందుకే హైదరాబాద్ ఫిబ్రవరి 7వ తేదీన 'లక్ష డప్పులు - వేల గొంతుల' సాంస్కృతిక కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. గత సంవత్సరం ఆగస్టు 1వ తేదీన సుప్రీం కోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిందని, నాలుగు నెలల 26 రోజులు గడుస్తున్న రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వర్గీకరణను అమలు చేయడం లేదని మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. అందరికంటే ముందే తెలంగాణలో అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సిఎం రేవంత్ రెడ్డి వెనక్కి తగ్గారన్నారు. వర్గీకరణను చేయకుండానే ఉద్యోగ నోటీఫికేషన్లను జారీ చేస్తున్నారని, గ్రూప్ -1, 2, 3 అమలు భర్తీ చేసేందుకు రంగం సిద్దం చేశారన్నారు. వర్గీకరణ జరగకుండానే ఇప్పటికే టీచర్ పోస్టులు భర్తీ చేశారన్నారు. ఈ మూడు మాటాలకు రేవంత్ రెడ్డి కట్టుబడి ఉంటే తాము రోడ్డు ఎక్కాల్సిన అవసరం ఉండేదికాదన్నారు. అందుకే తాము సాంస్కృతిక, వాయిద్యా ఉద్యమాన్ని చేపడుతున్నామని వివరించారు. వర్గీకరణపై సమాజం ఎటువైపు ఉండాలనే అంశంపై ప్రస్తుతం చర్చ జరుగుతుందన్నారు. సమాజమంతా వర్గీకరణ న్యాయమైందని, వర్గీకరణకే మద్దతు ఇస్తుందని తెలిపారు. ఎస్సిల జాబితాలో 59 కూలాలు ఉంటే, 58 కులాలు వర్గీకరణకు అనుకూలంగా ఉన్నాయన్నారు. వర్గీకరణ న్యాయమైనదే అనే విషయాన్ని అనేక కమిషన్లు తమ నివేదికలు సమర్పించాయన్నారు. తెలంగాణలో అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా వర్గీకరణకు మద్దతు ఇచ్చాయని, దేశంలో మెజారిటీ పార్టీలు వర్గీకరణకు మద్దతు ఇస్తున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బిఆర్ఎస్ , కాంగ్రెస్, టిడిపి ఎంఎల్ఎలు మద్దతు ఇచ్చారన్నారు. జాతీయ స్థాయిలో జెడిఎస్, ఆప్, శివసేన, లాలు ప్రసాద్ యాదవ్ పార్టీలు మద్దతు ఇచ్చాయని తెలిపారు. వర్గీకరణపై 1999లో రాష్ట్రపతి అభిప్రాయం కోరిందని, అప్పటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ వర్గీకరణ అమలు చేయాలని స్పష్టం చేశారన్నారు. యుపిఏ ప్రభుత్వ హయంలో ఉషామేహ్రా కమిషన్ ఏర్పాటు చేశారని, ఉమ్మడి రాష్ట్రంలో నాలుగేళ్లు వర్గీకరణ అమలు జరిగిందని వివరించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీం తీర్పు వచ్చిన 24 గంటల్లోనే రద్దు చేయించారని, 1999లో నోటీఫికేషన్ వర్గీకరణ అమలు చేశారని అన్నారు. ఇప్పుడు అనుకూలంగా తీర్పు వచ్చి నాలుగు నెలల 26 రోజులవుతున్నప్పటికీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రద్దు అయిన చట్టాన్ని పునరుద్దరించాలన్నారు. వందల సంవత్సరాల క్రితమే డప్పులు ప్రజలకు సమాచారం అందవేశాయని మంద కృష్ణ మాదిగ అన్నారు. ఫిబ్రవరి 7న మాదిగల గుండె చప్పుళ్లు, కోట్లాది మంది ఆకాంక్షలు, కోట్ల గొంతుకలతో ప్రపంచంలోనే మొట్టమొదటి సాంస్కృతిక వాయిద్యా ఉద్యమానికి హైదరాబాద్ వేదిక కాబోతుందన్నారు. తాము గతంలో నిర్వహించిన అనేక పోరాట కార్యక్రమాలకు రేవంత్ రెడ్డి పాల్గొని సంఘీభావం ప్రకటించారని, రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక ఒక్క వ్యతిరేక ప్రకటన కూడా తాము ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ను శాసించే రెండు కుటుంబాలు రేవంత్ రెడ్డికి బ్రేకులు వేశాయని తెలిపారు. ఒక మల్లు, మరోకటి వెంకట స్వామి కుటుంబం మాత్రమే బ్రేకులు వేస్తున్నాయని ఆరోపించారు. ఈ రెండు కుటుంబాలకు కాంగ్రెస్ లో మంచి పలుకుబడి ఉందన్నారు. కాంగ్రెస్ జాతీయ నేత కె.సి.వేణుగోపాల్ వర్గీకరణను అమలు చేయవద్దు అని చెప్పడంతోనే రేవంత్ రెడ్డి అమలు చేయడం లేదన్నారు. రాహుల్, మల్లికార్జున్ ఖర్గే తమ ఎన్నికల మేనిఫేస్టోలో వర్గీకరణకు అనుకూలమని ప్రకటించిన విషయాన్ని కృష్ణ మాదిగ గుర్తు చేశారు. గద్వాల్ సభలో రాహుల్ గాంధీ ప్రకటించారని, కాంగ్రెస్ జాతీయ కమిటీ ఆమోదం లేకుండానే ప్రకటించారా? అని ప్రశ్నించారు.

### లేఖరాసి ఊరుకున్నారమో..

పద్మ అవార్డులు తనకు ప్రకటించడం పట్ల సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారన్నారు. కానీ తాము పంపించిన జాబితాలో ఎవ్వరికీ రాలేదని అన్నారని మంద కృష్ణ అన్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన గద్దర్, అదేశ్రీ, గౌరటి వెంకన్న లాంటి వారి పేర్లతో జాబితా పంపించారని, కేవలం లేఖరాసి ఊరుకున్నారమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పద్మ అవార్డులు ఇవ్వాల్సిన వ్యక్తుల ప్రతిభ గురించి కేంద్రానికి చెప్పి ఇప్పించాల్సిందని చెప్పారు. మాదిగ రిజర్వేషన్ పాటు సామాజిక ఉద్యమాలు నడిపిన నేపథ్యం తనకు ఉందన్నారు. ఆరోగ్యశ్రీ, వికలాంగుల పెన్షన్ లాంటి సామాజిక మార్పులు తీసుకొచ్చిన చరిత్ర తనదని మందకృష్ణ మాదిగ అన్నారు

# తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రికార్డు

(మొదటి పేజీ తరువాయి..)

విజయవంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజునే లక్షలాది మంది ఈ సంక్షేమ పథకాలను అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంపిక చేసిన 563 గ్రామాల్లో ఈ పథకాలను ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. ఽూసతి అఠజీతిబిజీనాజీ: విద్యార్థులకు నాసిరకం భోజనం.. తీరు మార్చుకోని సెంట్రల్ కిచెన్ సిబ్బంది ఆయా గ్రామాల్లో ఉన్న రైతులకు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఆర్థిక సాయాన్ని అప్పటికప్పుడే వారి ఖాతాల్లో జమ చేసింది. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేసింది. గూడు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించింది. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు కొత్త కార్డులు జారీ చేసింది. పాత కార్డుల్లో అదనంగా సభ్యులను నమోదు పక్రియను పూర్తి చేసింది. మొదటి రోజునే రాష్ట్ర ప్రభుత్వం రూ.569 కోట్ల రైతు భరోసా విడుదల చేసింది. మొత్తం 32 జిల్లాల్లో 563 గ్రామాలలో 4,41,911 మంది రైతులకు ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. ఒక్క రోజులోనే మొత్తం రూ.569 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసింది. మొదటి రోజునే 9,48,333 ఎకరాల విస్తీర్ణంలోని భూమికి రైతు భరోసాను చెల్లించింది. 26వ తేదీన బ్యాంకులకు సెలవు దినం కావటంతో.. 27వ తేదీ ఉదయం నుంచి ఈ రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. మొదటి విడతగా రూ.6 వేలు చెల్లించింది. తొలి రోజున దాదాపు 18180 వేల వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఈ నగదు సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేసింది. ఈ పథకానికి తొలి రోజునే ఆర్థిక శాఖ రూ.10.91 కోట్లు విడుదల చేసింది. గత పదేండ్లుగా కొత్త రేషన్ కార్డులకు ఎదురుచూసిన తెలంగాణ ప్రజల నిరీక్షణ ఫలించింది. ప్రజా ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు జారీ ప్రారంభించింది. వీటితో పాటు పాత రేషన్ కార్డుల్లో అదనపు కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసింది. తొలి రోజున 531 గ్రామాల్లో 15414 కొత్త కార్డులు ఇచ్చింది. వీటిలో 51912 మంది కుటుంబ సభ్యులు లబ్ది పొందారు. వీటితో పాటు అదనపు సభ్యులను చేర్చాలంటూ 1.02 లక్షల మంది కార్డుదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఏళ్లకేళ్లుగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించింది. ఇప్పటికే ఉన్న కార్డుల్లో అదనంగా 1,03,674 మంది కుటుంబ సభ్యులను నమోదు చేసింది. వచ్చే నెల నుంచి వీరికి రేషన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయనుంది. గూడు లేని నిరుపేదల కు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో తొలి రోజునే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 72 వేల మంది పేదలకు ఇళ్ల పత్రాలను అందించింది.

# కులగణన పూర్తి చేశారు.... రిజర్వేషన్లు పెంచడానికి జాప్యం ఎందుకు ?

42 శాతం కు పెంచకపోతే యుద్ధమే జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం వచ్చే ఫిబ్రవరి నెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు కులగణన చేయాలని పూర్తి చేశారు. దీని ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలి. కులగణన చేసిన తరువాత రిజర్వేషన్లు పెంచితే న్యాయపరమైన చట్ట పరమైన అవరోదలు యుండవన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, వార్డు మెంబర్లలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం కు పెంచాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50శాతం సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవడానికి వీలులేదు. ఇప్పటికే అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టి 50 శాతం సీలింగ్ పై పార్లమెంటు రాజ్యాంగ సవరణ చేసింది. అగ్ర కులాలకు రిజర్వేషన్లు పెంచడానికి మూడు రోజులలో లోక్ సభ, రాజ్యసభలో రాజ్యాంగ సవరణ చేసి రాష్ట్రపతి సంతకం చేశారు. కాని 50 శాతం జనాభా గల బీద కులాలకు రాజ్యాంగ సవరణ చేయరా! మన దేశంలో ఇదేమి న్యాయమని ప్రశ్నించారు. అసెంబ్లీలో చట్టం చేసి 42 శాతం పెట్టవచ్చని ఆర్. కృష్ణయ్య అభిప్రాయపడ్డారు. అవసరమైతే అన్ని పార్టీలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాయున్నవి. పార్లమెంట్ రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే గ్రామస్థాయి నుంచి ఉద్యమిస్తామని తెలిపారు.

గతంలో 1986లో బి.సి సంక్షేమ సంఘం అనేక ఉద్యమాలు చేయగా అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గారు స్పందించి బి.సి.లకు జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపాల్ ఎన్నికలలో 20శాతం రిజర్వేషన్లు పెట్టారు. సర్పంచ్ లకు పెట్టలేదు. బి.సి రిజర్వేషన్లు 50శాతంకు పెంచాలని, సర్పంచ్ ఎన్నికలలో కూడా బి.సి రిజర్వేషన్లు పెట్టాలని బి.సి సంక్షేమ సంఘం 6 సంవత్సరాలు వరుసగా సుదీర్ఘంగా ఉద్యమాలు చేయగా 1993లో అప్పటి ముఖ్యమంత్రి విజయభాస్కర్ రెడ్డి స్పందించి ఒక మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి బి.సి సంఘాలతో చర్చించి 20 శాతం నుంచి 34 శాతం పెంచుతూ రిజర్వేషన్లు పెట్టారు. అప్పటి నుంచి 2019 వరకు 34 శాతం రిజర్వేషన్లు కొనసాగాయి. సుప్రీంకోర్టు తర్వాత తీర్పు ప్రకారం 2019లో స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22శాతంకు తగ్గించారు. దీనితో బీసీలకు అన్యాయం జరిగింది. అప్పటి నుంచి జాతీయ బి.సి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీ పార్లమెంట్ వద్ద ధర్నాలు జరిపి అన్ని పార్టీల మీద ఒత్తిడి తేవడంతో కులగణన జరిపి బీసీ రిజర్వేషన్లు పెంచుతామని అన్నీ పార్టీలు హామీ ఇచ్చారు. అందులో భాగమే పెంచుతామన్న కాంగ్రెస్ పార్టీ జనాభా ప్రకారం పెంచుతామని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో ఈ క్రింది తీర్మానాలు ఆమోదించారు.

1. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా బి.సి రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతంకు పెంచిన తరువాతే ఎన్నికలు జరపాలి.
2. జనాభా ఆధారంగా విద్యా, ఉద్యోగ రాన్గాలలోని రిజర్వేషన్లను కూడా 50 శాతంకు పెంచాలి.
3. రాష్ట్రంలో ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. వెంటనే ఇప్పుడు 13 కార్పొరేషన్లకు తోడుగా మరో 40 కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రస్తుతం యున్న 11 పెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలన్నారు.
4. పార్లమెంట్ లో బి.సి బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బి.సి లకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి.
5. బి.సి లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. బి.సి ల అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలి.
6. బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి.ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలి.
7. పంచాయతీరాజ్ సంస్థలో బి.సి రిజర్వేషన్లను 50 శాతం కు పెంచాలి. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలి.
8. బి.సి ల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ల పై ఉన్న క్రిమి లేయర్ ను తోలగించాలి.

# కేంద్ర పథకాలపేర్లు మార్చితే ఊరుకోం

(మొదటి పేజీ తరువాయి..)

ప్రభుత్వం అన్నీ ఆలోచించి పంపాలని సూచించారు. నక్సల్స్ భావజాలమున్న గద్దర్ వందలాది మంది బీజేపీ కార్యకర్తల చావులకు కారణమయ్యారని, అట్లాంటి వ్యక్తి పద్మ అవార్డు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. తెలంగాణ సెంటిమెంట్ ను మరోసారి రగిలించి లబ్ది పొందాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ చూస్తున్నాయని, కానీ ప్రజలందరికీ ఈ విషయం అర్ధమైందన్నారు. సోమవారం రోజున హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే....

లిగరీబ్ కళ్యాణ్ యోజన, పీఎం ఆవాస్ యోజన వంటి కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం మార్చాలనుకుంటోంది. అట్లా చేస్తే చూస్తూ ఊరుకోబోం. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వంతో ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తాం. పరిస్థితి అంతవరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా...

సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ అన్యాయం చేయబోం. ప్రజలందరికీ ఉచితంగా బియ్యం కేంద్రమే ఇస్తోంది కదా.... గరీబ్ కళ్యాణ్ యోజన అని పేరు పెడితే తప్పేంది? ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరు?.

రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చుయ్యే సంక్షేమ పథకాలకు ఎవరు పెట్టుకున్నా మాకు అభ్యంతరం లేదు. కాంగ్రెస్ కు నచ్చితే ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం పేర్లు పెట్టుకున్నా మాకు అభ్యంతరం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోంది.

గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసింది. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే. రైతు భరోసా, కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, వీధి దీపాలు, రోడ్ల పైసలన్నీ కేంద్ర ప్రభుత్వానివే.

6 గ్యారంటీలపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి లేనేలేదు. మండలానికి ఒక గ్రామంలోనే 4 పథకాలకు ఎంపిక చేసి లబ్ది చేయడమేంది?. మిగిలిన గ్రామాల ప్రజలు కాంగ్రెస్ కు ఓట్లేయలేదా?. రాష్ట్ర ప్రజలకు ఇంత దుర్మార్గంగా చీటింగ్ చేస్తారా?. రాష్ట్ర ప్రజలందరికీ లబ్ది చేకూరుస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామానికి లబ్ది చేకూర్చడం నీచం.

కాంగ్రెస్ నేతల జేబుల నుండి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నారా? లేక పాకిస్తాన్..బంగ్లాదేశ్ నుండి తెచ్చి ఖర్చు చేస్తున్నారా?. ప్రజలు కట్టిన పన్నులతోనే కేంద్రమైనా, రాష్ట్రమైనా ఖర్చు చేస్తోంది కదా?లి


గతంలో పీఎం ఆవాస్ యోజన పేరుతో 2 లక్షల 40 వేల ఇండ్లను కేంద్రం మంజూరు చేస్తే... కేసీఆర్ ఒక్క ఇల్లు కట్టకుండా ప్రజలను రోడ్డున పడేసింది నిజం కాదా?. డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసింది నిజం కాదా?.

పద్మ అవార్డుల జాబితాను పంపేటప్పుడు... రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలి. గద్దర్ కు ఎట్లా పద్మ అవార్డు ఇస్తాం?... ఎంతో మంది బీజేపీ కార్యకర్తలను కాల్చి చంపించారో తెలియదా? వందల మంది బీజేపీ కార్యకర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేస్తే... నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్....

కాంగ్రెస్, బీఆర్ఎస్ తెలంగాణ సెంటిమెంట్ తో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తున్నాయి. తెలంగాణ సెంటిమెంట్ తో ఎవరు లాభపడ్డారో... ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైంది...ఇక ఆ పార్టీల మాటలను ప్రజలు నమ్మరు..

# రూ.67 వేల కోట్లు అప్పులతో దివాళా తీయించారు

**అమరావతి,జనవరి27( వెలుతురు):**



గత ప్రభుత్వం చేసిన అప్పులపై వడ్డీలు కట్టలేని దుస్థితిలో ప్రస్తుతం రాష్ట్రం ఉందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోతే ప్రజలపై పన్నుల భారం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.అభివృద్ధి పనుల వల్లే సంపద పెరుగుతుంది. అలాగని అప్పులు చేసి.. పనులు చేస్తే ఇబ్బందులు పెరుగుతాయి. అప్పులు తిరిగి తీర్చే శక్తి మనకు ఉందో లేదో చూడాలి. అప్పులు చేసి తిరిగి చెల్లించే శక్తి మన రాష్ట్రానికి లేదు. అందుకే గత ప్రభుత్వం.. ప్రభుత్వ కార్యాలయాలను తాకట్టు పెట్టింది. గత ఐదేళ్లలో వచ్చిన డబ్బును ఏం చేశారో తెలియడం లేదు. తెచ్చిన అప్పులను ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెడితే ఆదాయం పెరగదు. గతంలో చేసిన అప్పులకు వడ్డీ కట్టడం కూడా ప్రస్తుతం కష్టంగా ఉందని చంద్రబాబు అన్నారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేని పరిస్థితి ఎదురవుతుం దన్నారు. 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నీతి ఆయోగ్ ఇచ్చిన రిపోర్టుపై సీఎం మీడియా సమావేశం నిర్వహించారు. స్టేట్ ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్-2025 నివేదికపైనా సీఎం ప్రజెంటేషన్ ఇచ్చారు. నీతి ఆయోగ్ ఇచ్చిన నివేదికను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. '202223 ఆర్థిక సంవత్సరంలో రూ.67 వేల కోట్లు అప్పులు తెచ్చారు. కానీ, ఆ రుణాలను కనీస స్థాయిలో కూడా అభివృద్ధి ప్రాజెక్టులకు వినియోగించలేదు. వచ్చిన డబ్బులతో వైకాపా ప్రభుత్వం దుబారా ఖర్చులు చేసింది. రాష్ట్ర ఆదాయం కూడా 17.1 శాతం నుంచి 9.8 శాతానికి తగ్గిపోయింది. అప్పులు 16.5 శాతం మేర పెరిగాయి. వడ్డీ కట్టే మొత్తం కూడా 15శాతం పెరిగింది. ఇవి కాకుండా ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ కూడా పెద్ద మొత్తంలో జరిగాయి. వైకాపా హయాంలో ఎక్కువ వడ్డీకి అప్పులు తేవడం, మూల ధన వ్యయం లేకపోవడం, పన్నులు పెంచడం లాంటి వివిధ అంశాల వల్ల ఏపీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని వివరించారు. 'ఆరోగ్యంపై మనం ఎప్పుడూ దృష్టి పెడతాం. ఆరోగ్యం బాగుంటేనే ఏదైనా చేయగలం. అనారోగ్యంతో ఉంటే ఇంట్లో అందరికీ ఇబ్బందులు వస్తాయి. ఆర్థిక పరిస్థితి బాగా లేకుంటే అభివృద్ధి పనులు సరిగా చేయలేం. ఇదే కొనసాగితే చివరికి బాధపడేది ప్రజలే. రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం అందరూ ఆలోచించాలి. అభివృద్ధి పనులపై నిధులు ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోతే ప్రజలపై పన్నుల భారం పడుతుందని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేని పరిస్థితి ఎదురవుతుందన్నారు. గతంలో చేసిన అప్పులకు వడ్డీ కట్టడం కూడా ప్రస్తుతం కష్టంగా ఉంది' అని చంద్రబాబు అన్నారు. 2022-23లో రూ.7,244 కోట్లు మూలధన వ్యయం చేశారు. ఒక్క జలవనరు ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. 2014-19తో పోలిస్తే గత ఐదేళ్లలో మూల ధన వ్యయం 60శాతం మేర తగ్గిపోయింది. ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్‌లో ఏపీ 18వ ర్యాంకులో ఉంది. వృద్ధి రేటు లేకపోవడం వల్ల రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల మేర నష్టపోయింది. ఏటా రూ.76 వేల కోట్ల ఆదాయం పోయింది. అందుకే రాష్ట్రానికి వృద్ధి రేటు అనేది చాలా ముఖ్యమని మా ప్రభుత్వం పదే పదే ప్రస్తావిస్తోంది. తలసరి ఆదాయంలో కూడా పొరుగు రాష్ట్రలతో పోల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. ప్రజల కొనుగోలు స్థితి కూడా తగ్గిందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక సామాజిక విధ్వంసంపై 7 శ్వేతపత్రాలు కూడా విడుదల చేశాం. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల్లో భాగంగా 15శాతం వృద్ధి రేటు కోసం ప్రణాళికలు వేస్తున్నాం. తద్వారా 2047 నాటికి తలసరి ఆదాయం రూ.58,14,916 కు చేరుతుంది. సూపర్ సిక్స్‌లో ఎన్టీఆర్ భరోసాలో భాగంగా 64 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నాం. దీపం 2.0 పథకంలో ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, ఇసుక, మద్యం, క్లీన్ ఎనర్జీ, ఎమ్ఎస్ఎమ్ఈ లాంటి కొత్త విధానాలు తీసుకువచ్చాం. రూ.8,258 కోట్ల మేర బిల్లులు క్లియర్ చేశాం. రూ.9015 కోట్ల మేర కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్ కూడా ఇచ్చి 76 పథకాలు రివైవ్ చేశాం అని అన్నారు. ఇప్పటి వరకు రూ.6,33,568 కోట్ల మేర పెట్టుబడులు వస్తున్నాయి. తద్వారా 4.10 లక్షల ఉద్యోగాలు వస్తాయి. మేం ఊహించిన దానికంటే ఎక్కువ విధ్వంసం జరిగింది. రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. మేము చెప్పిందే ఇప్పుడు నీతి ఆయోగ్ ధృవీకరించింది. వృద్ధిరేటు సాధిస్తే ఆదాయం పెరిగి, అప్పులు తగ్గించుకునే పరిస్థితి వస్తుంది. ఎక్కువ వడ్డీకి అప్పులు తీసుకొచ్చారు. అందుకే డెబ్ట్ రీ షెడ్యూల్‌కి వెళ్తున్నాం. ఆర్థిక రంగంలో సుస్థిరత వస్తేనే రాష్ట్రం గాడిన పడుతుంది. వైకాపా హయాంలో తలసరి ఆదాయం పెరగలేదు. కానీ, తలసరి అప్పు పెరిగింది. గాడిన పెట్టడానికి కొంచెం ఆలస్యం అవుతోంది. ప్రజలు అర్థం చేసుకోవాలి. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంతోపాటు మెరుగైన పాలన అందిస్తాం' అని చంద్రబాబు అన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకు తామంతా పోరాడుతున్నాం

- రాహుల్ వెన్నంటి నడుస్తున్నాం
- ఇండోర్ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి



**ఇండోర్,జనవరి27( వెలుతురు):**
రాజ్యాంగ పరిరక్షణకు తామంతా రాహుల్ గాంధీ వెన్నంటి పోరాడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇది ఎన్నికల ర్యాలీ కాదని, ఒక యుద్ధమని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ పోరాటం చేస్తున్నామని చెప్పారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇండోర్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఈ పరిణామాన్ని గ్రహించే పోరాడుతున్నారని చెప్పారు. గజనీ మహమ్మద్ హిందుస్థాన్‌ను దోచుకునేందుకు యత్నించినట్టు మోదీ రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పేరుతో కొనసాగుతున్న బ్రిటీష్ జనతా పార్టీని ఎదుర్కొనేందుకు రాహుల్ పోరాడుతున్నారని చెప్పారు. ఇది గాంధీ పరివార్, గాడ్సే పరివార్ ల మధ్య సాగుతున్న యుద్ధమని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని రక్షిస్తుందని, రిజర్వేషన్లు కాపాడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మధ్య ప్రదేశ్ లోని ఇండోర్ లో జరిగిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీకి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ, అమిత్ షా రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల సమయంలో బీజేపీ 400 సీట్లు అడిగిందని, అబ్ కీ బార్ చార్ సౌ పార్ అనే నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లిందని అన్నారు. ప్రజలు వాళ్ల కుట్రలను గ్రహించే 240 సీట్లకు పరిమితం చేశారని సీఎం రేవంత్ చెప్పారు. రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణ బీజేపీ విధానమని పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డ నాటి నుంచి బీజేపీ నేతలు ఆందోళనలో ఉన్నారని అన్నారు. 2025 వాళ్లకు కీలకంగా మారిందని అన్నారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకే తాము జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహిస్తున్నామని సీఎం చెప్పారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలోనూ రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణే ధ్యేయమని చెప్పారని, దానికి కట్టుబడే కాంగ్రెస్ పార్టీ పోరాటాలు సాగిస్తోందని అన్నారు. బీజేపీకి అంబేద్కర్ పేరు అన్నా.. రాజ్యాంగం, రిజర్వేషన్లు అన్నా నవ్వులాటగా మారాయని అన్నారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి తదితరులు ఉన్నారు.

# సీఎం రేవంత్‌పై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

- రైతుబంధును ఎగ్గొట్టాడని రైతుల శాపనాలు
- పథకాలపై నిలదీతలతో సమాధానాలు చెప్పలేకపోతున్నాం
- రేవంత్ కంటే కేసీఆర్ పాలనే బాగుంది
- వైరల్ అవుతున్న రాజగోపాల్‌రెడ్డి వీడియో



**మునుగోడు, జనవరి27 ( వెలుతురు):**
కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తమ ప్రభుత్వంపై అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతు బంధును ఎగ్గొట్టామని, రైతు భరోసాలో ఇచ్చిన హామీ మేరకు కాకుండా కొంత నగదు తగ్గించామని, గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టుకుంటున్నారని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు పథకాలు (ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు) ప్రారంభోత్సవంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మసీదుగూడెంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ 'తమకు రైతు రుణమాఫీ కాలేదని, రైతుబంధు రాలేదని గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వాన్ని తిరుడున్నారు. అంతా కేసీఆర్ పాలనే బాగుండేదని మెచ్చుకుంటున్నారు' అని అన్నారు. 'రైతుబంధును మధ్యలో ఒకసారి ఎగ్గొట్టినం. రైతు భరోసాలో ఇచ్చిన హామీ మేరకు కాకుండా, కొంత నగదును తగ్గించినం. అందుకే గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని తిడుతున్నారు. అదే రూ.2 లక్షల రుణ మాఫీ అయినోల్లు మాత్రం జేబులో వేసుకొని సప్పుడు చేస్తలేరు. ఎన్ని అప్పులు చేసైనా పథకాలు అమలు చేస్తాం' అని అన్నారు. ఇందుకు సంబంధించిన ఓ ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సొంత పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపైనే రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేయడంతో.. ప్రతిపక్షాలు ఆ వ్యాఖ్యలను ఆయుధంగా చేసుకుంటున్నాయి. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్? ప్రభుత్వం పూర్తిగా ఫెయిలైందని, ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొంటున్నారు. ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు కూల్చేస్తారని బీఆర్ఎస్, బీజేపీ నేతలు పేర్కొంటున్నారు.

# సుప్రీంలో ఉదయనిధికి ఊరట

- సనాతన ధర్మంపై కేసు తోసిపుచ్చిన ధర్మాసనం

**న్యూఢిల్లీ,జనవరి27( వెలుతురు):**
సనాతన ధర్మంపై విమర్శలకు సంబధించిన కేసులో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. సనాతన ధర్మంపై వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన మూడు రిట్ పిటిషన్లను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఇవి ఎలా పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నించిన జస్టిస్ బేలా ఎం.త్రివేదీ, జస్టిస్ ప్రసన్న బి.వరాలేలతో కూడిన ధర్మాసనం.. ఈ పిటిషన్లను తోసిపుచ్చింది. సెప్టెంబరు 2023లో తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. 'సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి' అంటూ వ్యాఖ్యానించారు. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకమన్నారు. అనంతరం తన వ్యాఖ్యలు ఎవరి మనోభావాలు దెబ్బతీసే ఉద్దేశంతో చేసినవి కావని పేర్కొన్నప్పటికీ.. హిందూ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలోనే ఉదయనిధిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీం కోర్టులోనూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

# పర్యాటక కేంద్రంగా సింగూర్ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తాం

## దామోదర్ రాజనర్సింహ,

- అధికారులతో కలిసి సింగూరు జలాశయం ను టూరిస్ట్ స్పాట్ గా తీర్చిదిద్దడానికి క్షేత్రస్థాయి పర్యటన చేసిన మంత్రి.
- సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్ గా తీర్చిదిద్దేలా మాస్టర్ ప్లాన్ ను రూపొందించాలని మంత్రి ఆదేశం.
- ప్రాజెక్టు ఐలాండ్ లో వాచ్ టవర్ నిర్మాణం, రెస్టారెంట్, ఫుడ్ కోర్ట్, చిల్డ్రన్ ప్లే ఏరియా, గార్డెన్ ఏర్పాటు కు చర్యలు.
- ప్రాజెక్టు దిగువ భాగంలో 29 ఎకరాల్లో రెస్టారెంట్ ఆధునిక కాటేజీల ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించిన మంత్రి.



**పుల్కల్ మండలం వెలుతురు జనవరి 27:**
సంగారెడ్డి జిల్లాలోని పుల్కల్ మండలం లోని సింగూర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సోమవారం సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో కలిసి మంత్రి క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. సింగూర్ ప్రాజెక్టులో 50 సీట్ల కెపాసిటీ తో నడిచే రెండు అధునాతన సౌకర్యాలతో కూడిన బోట్లు ,స్పీడ్ బోట్లను ఏర్పాటు చేయాలని మంత్రి పర్యాటక, నీతిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా మాస్టర్ ప్లాన్ ,రోడ్ మ్యాప్ లను రూపొందించాలని మంత్రి టూరిజం , ఇరిగేషన్ , ఆర్ అండ్ బి శాఖల అధికారులను ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టులో ఉన్న ఐల్యాండ్ లో వాచ్ టవర్ పైన రెస్టారెంట్, ఫుడ్ కోర్ట్, చిల్డ్రన్ ప్లే ఏరియా, ల్యాండ్ స్కేపింగ్, ఆర్ట్ స్కేపింగ్, గార్డెన్ లను అభివృద్ధి పరచాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు దిగువ భాగంలో పర్యటకులను ఆకర్షించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టు దికో భాగం లోని 29 ఎకరాలలో ఐదు కోట్ల రూపాయలతో అధునాతన రెస్టారెంట్, 25 అధునాతన కాటేజీలు నిర్మించాలని ఇందులో చిల్డ్రన్ ప్లే ఏరియా , ఫుడ్ కోర్ట్, గార్డెనింగ్, గ్రీనరీ, ల్యాండ్ స్కేటింగ్, పార్కింగ్ ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులు ఆదేశించారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సింగూర్ డ్యాం పై భాగంలో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. పర్యటకుల సౌకర్యం కోసం డ్యాం పై వెళ్లడానికి అవసరమైన మెట్ల నిర్మాణం డ్యాం బండ్ వెంట పార్కు అభివృద్ధి సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టు పరిసరాలలో సెంట్రల్ లైటింగ్ కు అవసరమైన ప్రతిపాదనలను ఫిబ్రవరి మొదటి వారం లోపు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సింగూరు ప్రాంతం కు వచ్చేలా వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. సింగూర్ ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకు లకు అధునాతన వసతులతో కూడిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ప్రాజెక్టుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంతో పాటు ఇరుగుపొరుగు రాష్ట్రాల పర్యాటకులు ఉందన్నారు. అన్ని వర్గాలకు చెందిన పర్యాటకులను ఆకర్షించేలా అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు ప్రాజెక్టు దిగువ భాగంలో, ఐలాండ్లో ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకుల సౌలభ్యం కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పెద్దపీట వేయాలని దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో పెద్దారెడ్డిపేట ఎక్స్ రోడ్డు నుండి సింగూర్ డ్యాం వరకు రహదారులుగా విస్తరణ చేపట్టాలని రహదారి వెంట అధునాతన లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అందోల్ ఆర్డిఓ పాండు, నీటిపారుదల శాఖ అధికారులు జై భీమ్, నాగరాజు ,ఆర్ అండ్ బి ఇంజనీర్లు రవీందర్ ,జగదీశ్వర్, పర్యటకశాఖ అధికారి నటరాజ్, రెవెన్యూ శాఖ అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.







# హుస్సేన్ సాగర్ ఘటనలో ఆచూకీలేని యువకుడు

- పోలీసుల గాలింపులో కానరాని ఆనవాళ్లు

**హైదరాబాద్,జనవరి27( వెలుతురు):**
హుస్సేన్‌సాగర్ లో రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం ఘటనలో ఓ యువకుడి ఆచూకీ తెలియడంలేదు. అగ్ని ప్రమాదంలో రెండు బోట్లు దగ్ధమవగా ఒక్క బోటులో ఫ్రండ్స్‌తో వెళ్లిన అజయ్ (21) అనే యువకుడు కనిపించడం లేదు. అజయ్‌తోపాటు వెళ్లిన ఫ్రండ్స్ మాత్రం సురక్షితంగా బయటపడ్డారు. అజయ్ ఏ ఆస్పత్రిలోనూ లేదని పోలీసులు చెబుతుండడంతో అతని కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. అజయ్ ఫ్రండ్స్ నుంచి లేక్ పోలీస్ స్టేషన్ పోలీసులు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో లేక పోలీసులు పడవలతో సాగరన్ చుట్టే గాలించినా ఫలితం లేకుండా పోయింది. కాగా భరతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద 'భరతమాత మహా హారతి' కార్యక్రమం నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. రెండు బోట్లలో బాణసంచా పేల్చడానికి కొందరు యువకులు రెండు బోట్లలో హుస్సేన్‌సాగర్ మధ్యలోకి వెళ్లారు. బాణసంచా కాలుస్తుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి అగ్నిప్రమాదం సంభవించింది. నిప్పురవ్వలు తిరిగి అవే బోట్లలో ఉంచిన బాణసంచాపై పడటంతో బోట్లకు మంటలు వ్యాపించాయి. దీంతో రెండు బోట్లు దగ్ధం కాగా.. అందులో ఉన్నవారు స్వల్పగాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. వారిలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. అందులో



ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నాగారానికి చెందిన అజయ్ తన కొలిగ్స్‌తో కలిసి హుస్సేన్‌సాగర్‌కు వచ్చాడు. అయితే బోట్స్‌లో అజయ్ ఉన్నట్లు ఫ్రండ్స్ చెబుతున్నారు. బోట్‌లో అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అందులో ఉన్నవారు అందరూ నీటిలోకి దూకారు. అదే సమయంలో అజయ్‌తోపాటు అతని స్నేహితులు ఉన్నారు. వారు సురక్షితంగా బయటపడ్డారు. అయితే అజయ్ ఆచూకీ మాత్రం లభించలేదు. దీంతో అతని కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అజయ్ ఎక్కడా ఏ ఆస్పత్రిలో జాయిన్ కాలేదని.. ఇదే విషయాన్ని పోలీసులు కూడా స్పష్టం చేశారు. అజయ్ అనే పేరుతో ఎవరూ ఆస్పత్రిలో జాయిన్ కాలేదని, క్షతగాత్రుల వివరాల్లో అజయ్ పేరు లేదని పోలీసులు తెలిపారు. దీంతో అజయ్ ఏమయ్యాడనే ఆందోళన కుటుంబసభ్యుల్లో నెలకొంది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆదివారం రాత్రి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన 'భరతమాత మహా హారతి' కార్యక్రమంలో ఆయనతోపాటు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అయితే కార్యక్రమం పూర్తయ్యాక పీపుల్స్ ఎ÷-లాజా సమీపంలో వేదిక వెనుక భాగంలో బాణసంచా కాల్చేందుకు పర్యాటక శాఖకు చెందిన రెండు బోట్లలో సామగ్రిని హుస్సేన్‌సాగర్ మధ్యలోకి తీసుకెళ్లారు. బోటులో డ్రైవర్, వాల్టర్, సిబ్బంది, బాణసంచా కాల్చే ఐదుగురు నిపుణులతోపాటు 15 మంది బీజేపీ కార్యకర్తలు ఉన్నారు. అయితే బాణసంచా కాల్చే క్రమంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో బోట్లలో ఉన్న కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు నీళ్లలోకి దూకారు. రంగంలోకి దిగిన అధికారులు.. జెట్టీలో మంటలను అదుపులోకి తెచ్చే పరికరాలు లేకపోవడంతో వారిని స్పీడ్‌బోట్‌లో బయటకు తీసుకువచ్చారు. అయితే ప్రమాదంలో బాణసంచా కాల్చే నిపుణుడు గణపతి (22)కి తీవ్ర గాయాలయ్యాయి. ఇతనితోపాటు ప్రమాదంలో గాయపడిన చింతల కృష్ణ (47), కరీంనగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి సాయిచంద్‌ను సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గణపతి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, సీతాఫల్‌మండికి చెందిన బీజేపీ కార్యకర్తలు సునీల్, ప్రణీత్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, కాలిపోయిన లూంబిని బోట్ విలువ రూ.12 లక్షలు ఉంటుందని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

# రైతు ఖాతాల్లోకి రైతు భరోసా జమ

- రాష్ట్ర వ్యాప్తంగా 4,41,911 మంది ఖాతాల్లోకి నగదు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

**హైదరాబాద్,జనవరి27( వెలుతురు):**
రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా జమ చేసే పక్రియ కొనసాగుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తొలి విడతలో మండలానికి ఒక గ్రామంలో రైతు భరోసా సొమ్ము విడుదల చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 4,41,911 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేసినట్లు చెప్పారు. 577 మండలాల్లోని 9,48,333 ఎకరాలకు గాను రూ.530 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా ఇస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రోజు 15,414 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి తుమ్మల చెప్పారు. 'కొత్త కార్డుల్లో 51,912 మందికి ఫిబ్రవరి నుంచి రేషన్ పంపిణీ చేస్తాం. తొలి రోజు మండలానికి ఒక గ్రామం చొప్పున కొత్త రేషన్ కార్డులు జారీ చేశాం. పాత రేషన్ కార్డుల్లో అదనంగా 1.03 లక్షల మంది పేర్లు చేర్చారు. 501 గ్రామాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభమైంది. మొదటి రోజు 20,336 మంది భూమిలేని కూలీలకు నిధులు విడుదలయ్యాయి' అని తెలిపారు. ఈ ఏడాది రైతుభరోసా కింద ప్రతి ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనున్నట్లు మంత్రి తుమ్మలచెప్పారు. భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రెండు విడతలుగా రూ.12 వేలు ఇస్తామని పేర్కొన్నారు. రైతులకు యాసంగికి పెట్టుబడి సాయం, కూలీలకు రూ.6 వేలు ఖాతాల్లో పడతాయని వివరించారు. సోమవారం నుంచి బ్యాంకుల్లో నగదు తీసుకోవచ్చన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నా రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామన్నారు. అందుకు రూ.21 వేల కోట్లు చెల్లించామని ప్రకటించారు. పథకాల అమలు నిరంతర పక్రియ అని అన్నారు. అర్హులైన అందరికీ పథకాలు వస్తాయని స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదికి 3,500 ఇళ్లు మంజూరవుతాయని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్నారు.

## సంపాదకీయం..

# మావోయిస్టులకు కాలం చెల్లిందా ?

మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇటీవలి ఎన్‌కౌంటర్లలో వరుసబెట్టి నేతలు నేలకు ఒరిగారు. కేంద్రం కూడా మావోల అణచివేతకు పకడ్బందీ వ్యూహంతో అడుగులు వేస్తోంది. ప్రజల్లో వారికి స్థానం లేకపోవడం కూడా అణచివేతకు వ్యతిరేకత రావడం లేదు. ఎన్‌కౌంటర్లు జరిగినా పెద్దగా స్పందన రావడం లేదు. ఇకపోతేగతంలో తెలంగాణ, ఎపిల్లో వారి పట్టుబాగా ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఈ రెండు రాష్ట్రాల్లో పూర్తిగా తుడిచిపెట్టుకు పోయాయి. కేవలం ఛత్తీస్‌ఘడ్‌లో మా÷–తరమే కొంత ప్రభావం చూపుతున్నారు. అదికూడా అడవులకే పరిమితం కావడం, అడపాదడపా చిన్నాచితకగా కార్యక్రమాలు చేపట్టడం వంటివి చేస్తున్నారు. అడవిచుట్టూ ఉన్న గిరిజనులు కూడా తుపాకులకు భయపడి వారికి సలాం కొడుతున్నారు. అయితే ఎన్‌కౌంటర్లలో అందరూ నేలకు ఒరిగినా ఒక్క గిరిజనులు లేదా గిరిజన ప్రజలు కన్నీరు కార్చడం లేదు. కారణమేమంటే మావోలు ప్రజలతో సంబంధాలను వదులుకున్నారు. ప్రజలకు దూరంగా ఉంటున్నారు. ప్రజా ఉద్యమాలు ఆగిపయాయి. ప్రజల పక్షాన కొట్లాడడం లేదు. అందుకే మావోయిస్టు పార్టీ చివరి శ్వాస తీసుకుంటున్నది.నక్సలైట్ విముక్త భారత్ కోసం సాయుధ బలగాలు అత్యంత ధైర్యసాహసాలతో వందలాదిమంది మావోయిస్టులను నేల కూల్చారు. చత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ల్లోని అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణ స్పందన ఇది. మావోయిస్టు లకు ఇక స్థానం లేదని, నక్సలిజం అంతరించిందని అన్నారు. తుపాకీతో రాజ్యం సాధించడం కల్ల అని తేలిపోయింది. భారత సైన్యం పెద్ద ఎత్తున విరుచుకుపడుతున్న నేపథ్యంలో మావోయిస్టులు భారీ మూల్యం చెల్లించుకోకతప్పడం లేదు. దేశ సైనిక సంపత్తి,టెక్నాలజీ, ఇతర వనరులతో పోల్చితే మావోయిస్టు పార్టీకి ఉన్న బలం చాలా తక్కువని చెప్పక తప్పదు. అలాగే బయట దేశాల నుంచి అందే సహాయం కూడా బాగా తగ్గిపోయింది. రిక్రూట్‌మెంట్ కూడా ఆగిపోయింది. యువత ఉద్యోగాన్వేషణలో పడింది. చచ్చ ఇసాధించేకన్నా బతికుండగానే సాధించుకోవాలన్న పట్టుదలతో యువత కెరీర్‌పై దృష్టి పెట్టింది. నాటి పీపుల్స్ వార్... మావోయిస్టు పార్టీగా మారాక 'సైనికీకరణ'కు ప్రాధాన్యం పెరిగింది. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ఏర్పాటు, కంపెనీలు, బెటాలియన్లు, ప్లాటూన్లు పెరిగాయి. దట్టమైన అడవుల్లో, సురక్షిత, దుర్భేధ్యమైన ప్రాంతాల్లో మాత్రమే మావోయిస్టు గెరిల్లా ఆర్మీ సంచారం సాధ్యం. అందుకే మావోయిస్టులు ఛత్తీస గఢ్‌లోని అబూజ్‌మడ్‌ను బేస్ క్యాంపుగా మార్చుకొని సాయుధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అబూజ్ మడ్ అడవుల్లోకి ప్రభుత్వం వరుస ఎన్‌కౌంటర్లతో ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం అట్టుడుకుతోంది. ఛత్తీస్‌గఢ్‌ఒడిశా సరిహద్దుల్లో ఇటీవల జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో కనీసం 27మంది మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి ఉన్నారు. ఆయన తలపై కోటి రూపాయల నజరానా ఉంది. నిఘా వర్గాల పక్కా సమాచారంతో ఛత్తీస్‌గఢ్‌ఒడిశాకు చెందిన సంయుక్త బలగాలు గరియాబంద్ జిల్లా పరిధిలోని కులహాదీ ఘాట్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఛత్తీస్‌గఢ్‌ఒడిశా సంయుక్త బృందాలు ఈ 30, సిఆర్‌పిఎఫ్, కోబ్రా 25 బెటాలియన్‌కు చెందిన జవాన్లు, సిఆర్‌పిఎఫ్ 65, 201 బెటాలియన్‌తో పాటు ఎస్ఓజి నువ్వా పాడ బృందం సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టాయి. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య అడపదడపా కాల్పులు కొనసాగుతున్నాయి. ఆపరేషన్ సమయంలో ఎస్ఎల్ఆర్ రైఫిల్‌తో పాటు పెద్ద ఎత్తున ఆటోమేటిక్ ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఒడిశా మావోయిస్టు సంస్థ అధిపతి, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగింది. ఈ ఎన్‌కౌంటర్‌తో నక్సలిజానికి మరో గట్టి దెబ్బ తగిలిందని, నక్సల్స్ రహిత భారత్ నిర్మాణంలో భద్రతా బలగాలు పెద్ద విజయాన్ని సాధించాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. సిఆర్‌పిఎఫ్, ఎస్ఓజి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఒడిశా –ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో సంయుక్త ఆపరేషన్‌లో 27 మంది నక్సలైట్లను మట్టుబెట్టారని అన్నారు. నక్సల్స్ రహిత భారతదేశం కోసం మన సంకల్పం, మన భద్రతా దళాల ఉమ్మడి ప్రయత్నాలతో నక్సలిజం తుదిశ్వాస విడిచిందంటూ తన వ్యాఖ్యానించారు. 2026 మార్చికల్లా చత్తీస్‌గఢ్ నక్సల్స్ రహిత రాష్ట్రం కాగలదని రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ అన్నారు. పోలీసులు, సీఆర్ పీఎఫ్ జవాన్ల సాహసం వల్లనే ఇది సాధ్యమవుతోందని చెబుతూ వారికి శాల్యూల్ అన్నారు. నిరుడు వివిధ ఎన్ కౌంటర్లలో దాదాపు 219 మంది నక్సల్స్ హతమయ్యారు. ఇకపోతే ఇండియాలో మావోయిస్టు పార్టీ 'నూతన ప్రజాస్వామిక విప్లవ' లక్ష్యాన్ని చేరుకోగలదన్న ఆశలు ఎప్పుడో అడుగంటాయి. అందుకు తగిన వాతావరణం కూడా లేకుండా పోయింది. ప్రజలంతా సొంతంగా భూమికోసం, భుక్తి కోసం పోరాడుతున్నారు. వారికి అండగా మావోయిస్టులు ఎక్కడా కానరావడం లేదు. తాజా పరిస్థితుల్లో ఉనికి అన్నది మావోయిస్టులకు ఒక సవాల్ అని చెప్పక తప్పదు. తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం వస్తుందన్న నినాదానికి కాలం చెల్లింది. విప్లవ యుద్ధం అనేది ప్రజలను సమీకరించడం ద్వారా, వారిపై ఆధారపడటం ద్వారా మాత్రమే సాధించగలం. అయితే ఈ దేశంలో మావోయిస్టు పార్టీ చేస్తున్న పోరాటాల్లో ప్రజల భాగస్వామ్యం లేకుండా పోయింది. ప్రజలతో సంబంధం లేకుండా చేస్తున్న పోరాటాలకు కాలం లేదన్న విషయం బలపడిపోయింది. చెల్లదని కూడా తేలిపోయింది. మావోయిస్టులు బాగా బలపడ్డ సందర్భాల్లో ప్రభుత్వాలు ఇంత శక్తిమంతంగా లేవు. అలాగే ప్రజలు కూడా బలంగా మావోయిస్టుల వెంట నడిచారు. మేధావులు, పత్రికలు కూడా అండగా నిలిచాయి. ఏ విప్లవమైనా ప్రారంభించే ముందు పరిస్థితులను సంపూర్ణంగా అధ్యయనం చేసి అంచనా వేయాలని కూడా మార్క్స్, ఎంగెల్స్ చెప్పారు. అలాంటి అంచనాల్లోనూ మావోయిస్టు పార్టీ విఫలమైందన్న భావన కలుగుతోంది. ప్రపంచంలో సోషలిస్టు శిబిరాలు కూలిపోయాక, పెట్టుబడిదారీ వ్యవస్థ, స్వేచ్ఛా వాణిజ్యం వర్ధిల్లుతున్నవి. ఈ దశలో భారతదేశంలో విప్లవం విజయవంతం కావడంపై అనుమానాలు సహజం. విప్లవం పతాక స్థాయికి చేరడానికి భారత్ చాలా దూరంలో ఉన్నది. విప్లవకారులు అత్యుత్సాహంతో కేవలం సాయుధ పోరాటాన్ని మాత్రమే ఆశ్రయించారన్న విమర్శలున్నవి. ప్రజలకు దూరంగా చేసే పోరాటం ఎప్పటికీ నిలబడదు. ప్రజాస్వామ్యంలో ప్రజలను దూరం పెట్టిన రాజకీయ పార్టీలే మట్టి కరుస్తున్నాయి.

# మావోయిస్టుల నిర్మూలనలో కేంద్రం పైచేయి

- **పూర్తిగా తుడిచిపెట్టే లక్ష్యంతా పనిచేస్తున్న బలగాలు**
- **ప్రజల్లో ఆదరణ కోల్పోవడంతో మావోలకు తప్పని తిప్పలు**

**న్యూఢిల్లీ,జనవరి27( వెలుతురు):**



దేశంలో అశాంతికి కారణమని చెబుతున్న మావోయిస్టుల అంశాన్ని పరిష్కరించడం అంటే వాళ్ళను నిర్మూలించడమేనని ప్రధాని మోడీ, అమిత్ షా చాలా కాలంగా భావిస్తున్నారు. అందుకే నక్సల్స్ నిర్మూలనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అడువులను జల్లెడ పట్టిస్తున్నారు. అర్బన్ నక్సలైట్లుగా గుర్తించిన వారిని సైతం అంతమొందిస్తున్నారు. కేసులతో వేధిస్తున్నారు. నక్సల్స్‌కు ప్రజాదరణ లేకుండా చేయడం, వారిని మట్టుపెట్టడం అన్న లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోంది. సమస్యఎంతటి తీవ్రమైనదైనా, దాన్ని సరిగా అర్థం చేసుకోకపోతే అది మరింత జటిలం కావచ్చు. సాయుధ దళాలు అడవుల్లోకి బాగా లోపలికి చొచ్చుకుపోగలుగుతున్నవి. ప్రభుత్వ సాయుధ బలగాలకు నక్సలైట్లకు మధ్య దూరం నానాటికీ తగ్గిపోతోంది. మావోయిస్టుల ప్రధాన స్థావరాలకు సమీపంలో బలగాలు చేరిపోతున్నాయి. అందుకు ప్రజల మద్దతు కూడా దక్కుతోంది. కారణమేమంటే ఇన్‌ఫార్మర్ల పేరుతో మావోయస్టులు అమాయక గిరిజనలను అంతమొందిస్తున్నారు. ఇది వారికి మింగుడు పడడం లేదు. ఇంతకాలం దుర్భేధ్యమనుకున్న ప్రాంతాలన్నీ సైనిక బలగాలు స్వాధీనపరచుకుంటున్నాయి. అమిత్ షా అన్నట్లుగా మావోస్ట్ పార్టీ కావచ్చు..వారి ఉద్యమం కావచ్చు...'అంతిమ ఘడియల్లో' ఉన్నట్టు చెప్పుకోక తప్పదు. బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఆదివాసులు, పేదప్రజలు, దళితులే మావోయిస్టులకు సానుభూతిపరులుగా ఉన్నారు. చాలా సందర్భాలలో ఆయా సానుభూతిపరులు సైతం ఎన్‌కౌంటర్లలో బలవుతున్నారు. మావోయిస్టుల ఏరివేత పేరిట భద్రతా దళాల అణచివేత చర్యలపై పౌర సమాజంలో పెద్దగా ఆందోళన వ్యక్తం కావడం లేదు. నిజానికి ప్రజల సమస్యలను ఎత్తుకున్న సమయంలో పీపుల్స వార్‌కు ప్రజల అండదండలు లభించాయి. రిక్రూట్‌మెంట్ దక్కింది. వారి పోరాటలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలు అండగా నిలిచారు. కాలక్రమంలో వారు దూరం కావడంతో మావోయిస్టుల ఉనికి కూడా కోల్పోతూ వస్తున్నారు. అందుకే దండకారణ్యంలో రక్తపుటేరులు పారుతున్నాయి. కాల్పుల మోతలతో బస్తర్ అడవులు మార్మోగుతున్నాయి. అబూజ్ మఢ్ కేంద్రంగా రెండు దశాబ్దాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మావోయిస్టులను భద్రతా బలగాలు వరుస ఎన్‌కౌంటర్లలో చావుదెబ్బ తీస్తున్నాయి. గత ఏడాదిగా జరుగుతున్న ఎదురుకాల్పుల ఘటనల్లో ఇప్పటివరకు మూడు వందలకు పైగా మావోయిస్టులు హతమైనట్లు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. ఈ ఏడాది ఆరంభంనుంచీ గత ఇరవై రోజుల్లోనే మూడు ఎన్‌కౌంటర్లలో 44 మందికి పైగా మావోయిస్టులు అసువులు బాశారంటే పోలీసులు ఎంతలా పైచేయి సాధించారో అర్థం చేసుకోవచ్చు. దండకారణ్యాన్ని చుట్టుముట్టి కాల్పులకు పాల్పడుతున్న సాయుధ బలగాలకు వెరచి గత ఏడాది కాలంలో సుమారు 850 మంది మావోయిస్టులు లొంగిపోగా, పోలీసులు మరో 400 మందికి పైగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, సిఆర్‌పిఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా 'ఆపరేషన్ కగార్' పేరిట సాగిస్తున్న ముప్పేట దాడికి సాంకేతిక పరిజ్ఞానమూ తన వంతు సహకారం అందిస్తూండటంతో మావోయిస్టులు మూల్యం చెల్లించుకోక తప్పడం లేదు. కాకులు దూరని కారడవిలో 650కి పైగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని, భద్రతా బలగాలు గాలింపు జరుపుతున్నాయి. మావోయిస్టుల జాడ తెలియగానే విరుచుకుపడి మట్టుబెడుతున్నాయి. అబూజ్ మఢ్ అడవుల్లో మావోయిస్టుల జాడ పసిగట్టడంలో జిల్లా రిజర్వ్ గ్రూపు (డిఆర్‌జి)లదే కీలకపాత్ర. ముల్లును ముల్లుతోనే వెలికి తీయాలన్న ఉద్దేశంతో.. లొంగిపోయిన నక్సలైట్లను ఉపయోగించుకుని, మావోయిస్టుల జాడ కనిపెట్టేందుకు ఏర్పాటు చేసిందే ఈ డిఆర్‌జి. దట్టమైన అడవిలో ఏది ఎక్కడుందో డిఆర్‌జిలకు కొట్టినపిండి కావడంతో గాలింపు చర్యలలో వారినే ముందుభాగంలో ఉంచుతున్నారు. ఇప్పటివరకూ జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో డిఆర్‌జిల సహకారం వల్లనే పోలీసులు పైచేయి సాధించారంటే అతిశయోక్తి కాదు. ఒకప్పుడు నక్సలిజం అనేక రాష్ట్రాల్లో ఊడలూనుకుని, ప్రభుత్వాలను గడగడలాడించిన మాట వాస్తవం. నక్సలైట్లు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ, పోలీసులపైన, ఇన్ఫార్మర్లపైన మెరుపుదాడులు జరిపి మట్టుబెడుతూ పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. నక్సలైట్ల తుపాకులకు ఎందరో ప్రజాప్రతినిధులు బలైన సంఘటనలు కోకొల్లలు. ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సైతం సాయుధ పోరాట దాడులతో విలవిల్లాడింది. కారణాలేమైతేనేం, ఉభయ తెలుగురాష్ట్రాల్లో నక్సలైట్ల జోరు తగ్గి, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్ వంటి రాష్ట్రాలకు విస్తరించింది. అడపాదడపా భద్రతాదళాలపై గెరిల్లా దాడులు చేస్తూ, మావోయిస్టులు ఉనికిని చాటుకుంటున్నారు. కేంద్రంలో మూడో దఫా అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం మావోయిస్టులను తుడిచిపెట్టేందుకు కంకణం కట్టుకున్నట్లు చత్తీస్‌గఢ్ అడవుల్లో చోటు చేసుకుంటున్న వరుస ఎన్‌కౌంటర్లను బట్టి తెలుస్తోంది. వచ్చే ఏడాది మార్చి నెలలోగా మావోయిస్టులనుంచి చత్తీస్‌గఢ్‌కు విముక్తి కల్పిస్తామంటూ కేంద్ర హోం మంత్రి చేస్తున్న ప్రకటనలను కూడా ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలి. తెలంగాణతో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో కమ్యూనిస్టులు గతంలో సాయుధ పోరాటం చేశారు. వారు ప్రజల్లో ఉంటూ పోరాడారు. కాలక్రమంలో రాజకీయం మారింది. కమ్యూనిస్టులు కూడా మెల్లగా అంతమవుతున్నారు. సరళీకరణ ఆర్థిక విధానాల కారణంగా ప్రజలు బతుకుదెరువు కోసం దేశాన్ని దాటేస్తున్నారు.

# అక్రమ వసలదారులపై ఉక్కుపాదం

- **ట్రంప్ రాకతో వెదికి పట్టుకుంటున్న అధికారులు**
- **తొలుత వ్యతిరేకించినా.. మోకరిల్లిన కొలంబియా**

**వాషింగ్టన్,జనవరి27( వెలుతురు):**



అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తూ..ప్రత్యేక విమానాల్లో వారిని స్వదేశాలకు పంపించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. అమెరికా సార్వభౌమత్వాన్ని పరిరక్షించడానికి అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. యూఎస్‌లో చట్టవిరుద్ధంగా ఆశ్రయం పొందుతున్న తమ పౌరులను వెనక్కి పిలుపించుకోవడానికి ప్రపంచ దేశాలు తగిన చర్యలు తీసుకొని మాకు సహకరించాలి' అని వైట్‌హౌస్ పేర్కొంది. అయితే ఈ చర్యలను ముందుగా వ్యతిరేకించిన కొలంబియా అనంతరం వెనక్కి తగ్గి అగ్రరాజ్యం పెట్టిన నిబంధనలకు అంగీకరించిందని వైట్‌హౌస్ పేర్కొంది. కొలంబియా వెనక్కి తగ్గి స్వదేశానికి తిరిగి వచ్చిన పౌరులను ఆహ్వానించడంతో తాము ఆ దేశంపై విధించిన సుంకాలు, పలు ఆంక్షలను నిలిపివేయనున్నట్లు అమెరికా ప్రకటించింది. 'అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులను ప్రత్యేక విమానాల్లో వారివారి స్వదేశాలకు పంపడానికి అగ్రరాజ్యం అనుసరిస్తున్న తీరుపై పలు దేశాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇలా వలసదారులను తీసుకొచ్చే విమానాలను తమ దేశంలోకి అనుమతించమని కొలంబియా తేల్చి చెప్పింది. 'కొలంబియా వలసదారులను తీసుకువచ్చే అమెరికా విమానాలను దేశంలోకి ప్రవేశించకుండా నిషేధిస్తున్నా' అని ఆ దేశాధ్యక్షుడు గుస్తావో పెట్రో (ఉబీబబిజీలనీ ఖ।బిసనీ) ఇటీవల పేర్కొన్నారు. వలసదారులను గౌరవంగా పంపించేందుకు అమెరికా నిబంధనలు రూపొందిస్తేనే వాటిని అనుమతిస్తామన్నారు. ఇప్పటికే అమెరికా సైనిక విమానాలను వెనక్కి పంపించినట్లు చెప్పారు. వలసదారులను నేరస్థులుగా చిత్రీకరించకుండా, అమెరికా పౌర విమానాల్లో పంపిస్తేనే వాటిని తమ దేశంలోకి అనుమతిస్తామని పెట్రో పేర్కొన్నారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కొలంబియా ఉత్పత్తులపై సుంకాలు 50 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. కొలంబియన్ ప్రభుత్వ అధికారుల వీసాలను వెంటనే రద్దు చేస్తానని అన్నారు. ఈ చర్యలు ఆరంభం మాత్రమే అని.. తమ నిబంధనలను పాటించి ప్రపంచ దేశాలు తమ పౌరులను తిరిగి వెనక్కి ఆహ్వానించకపోతే వారిపై మరిన్ని సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. మరోవైపు అమెరికా అనుసరిస్తున్న విధానంపై బ్రెజిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలా వలసదారుల చేతులకు సంకెళ్లు వేసి పంపించడాన్ని తీవ్రంగా పరిగణించింది.

# మహాకుంభమేళాలో పెరుగుతున్న రద్దీ

- **29న మౌని అమావాస్యకు పెరగనున్న భక్తులరాక**
- **దాదాపు పదికోట్ల మంది వస్తారని ప్రభుత్వ అంచనా**

**ప్రయాగ్‌రాజ్,జనవరి27( వెలుతురు):**



మహాకుంభమేళాలో రోజురోజుకు భక్తుల తాకిడి పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా భక్తులు తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరిస్తే సకల శుభాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. అందుకే భువి నలుచెరుగుల నుంచి సాధుసంతులు, అఘోరాలు, మాన్యులు, సామాన్యులు ప్రయాగ్ రాజ్‌కు పోటెత్తుతున్నారు. దీంతో రోజురోజుకూ రద్దీ పెరుగుతోంది. ఇప్పటికే కోట్ల మంది భక్తులు స్నానం ఆచరించారు . ఇన్ని రోజులు ఒక లెక్క. ఈ నెల 29న పోటెత్తే రద్దీ మరో లెక్క. జనవరి 29 ఈసారి మహాకుంభమేళలో ప్రత్యేకం కానుంది. ఇప్పుడు అన్ని దారులు పవిత్ర ప్రయాగ్ రాజ్ వైపే.. భక్త జనసంద్రానికి తీరమా.. అన్నట్టుగా త్రివేణి సంగమం సకల జనుల సందడితో కిక్కిరిసిపోతుంది.. ఈ నెల 13న మొదలైన మహాకుంభమేళ వచ్చే నెల 26 వరకు కొనసాగుతోంది. విభుడు, దేవాదిదేవతలు దివి నుంచి దిగి వచ్చే అమృత కాలమే మహా కుంభమేళ. ఈ 45 రోజుల్లో ఏ రోజులు త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరిస్తే సకల శుభాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. అందుకే భువి నలుచెరుగుల నుంచి సాధుసంతులు, అఘోరాలు, మాన్యులు, సామాన్యులు ప్రయాగ్ రాజ్‌కు పోటెత్తుతున్నారు. జనవరి 29 ఈసారి మహాకుంభమేళలో అద్వీతియమైన రోజు. బుధవారం మాఘమాస మౌని అమావాస్య మహిమాన్వితమైన సుదినంగా చెబుతున్నారు. మహాకుంభ మేళలో స్నానమాచరించ డమే ఎంతో పుణ్యం. ఇక మాఘ మాస మౌని అమావాస్య కలిసొచ్చిన వేళ.. గంగా స్నానం చేస్తే మరెంతో పుణ్యం. దానాలు చేస్తే జన్మ ధన్యం అనేది భక్తుల విశ్వాసం.. మౌని అమావాస్య రోజున అందరూ షాహి స్నాన్ ఆచరిస్తారు..మౌని అమావాస్య ధ్యానానికి జ్ఞానానికి చిహ్నం. ఆరోజు మౌనంగా వుంటూ ..పరమేశ్వుడిని ధ్యానిస్తూ పవిత్ర గంగా స్నానంచేసి పితృదేవుళ్లకు నీరాజనాలు అర్పిస్తారు. తద్వారా పూర్వీకులకు సద్గతులు కలగడం సహా అందరికీ సకల శుభాలు కలుగుతాయంటారు పండితులు. మహాకుంభమేళానే ఎంతో మహిమాన్వితం. ఇక ఈసారి మౌని అమావాస్య కలిసిరావడం మరెంతో శుభప్రదం.. ప్పటికే మహా కుంభ మేళాలకు కోట్లలో తరలి వస్తున్నారు భక్తులు.ఇక మాఘ మాస మౌన అమావాస్య ఒక్కరోజే పది కోట్లకు మంచి భక్తులు తరలి వస్తారనేది అంచనా. మౌన అమావాస్య కోసం భారత రైల్వే 150 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఎవరికీ ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా యూపీ సర్కార్ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఈసారి ప్రయాగ్ రాజ్‌లో యువతరం జోరు వెల్లి విరుస్తోంది. ఎక్కడ చూసినా యువోత్సాహం కనిపిస్తోంది. పీఠాధిపతులు, సన్యాసులు, నాగా సాధువులు, పెద్దవాళ్లకు దీటుగా యువత కన్పిస్తున్నారు. భక్తిశ్రద్ధలతో కుంభమేళలో పాల్గొంటున్నారు. కుంభమేళాకు వస్తున్న యువత గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు.. దేశంలోని యువత తమ ఆచార సంప్రదాయాలను తెలుసుకున్నప్పుడే మన మూలాలు బలపడతాయని ప్రధాని మోడీ అన్నారు. ఇక మౌని అమావాస్య కోసం దేశ విదేశాల నుంచి యువత ప్రయాగ్ రాజ్ పయనమైంది. జనవరి 29 బుధవారం.. మాఘమాస మౌని అమావాస్య మహాకుంభ మేళ సందడి మరింత పెరగనుంది. అందుకు తగ్గట్లుగా ఏర్పాటు సాగాయి.

# 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డికి ఘనంగా సన్మానం..

- పీర్జాదిగూడ ప్రథమ మేయర్ జక్క వెంకట్ రెడ్డి తో పాటు కార్పొరేటర్లను సన్మానించిన మున్సిపల్ కమీషనర్.....





**మేడిపల్లి, వెలుతురు:-**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ప్రజా సేవకుడు, అనునిత్యం ప్రజలకు అందుబాటులో వుంటూ 25వ డివిజన్ ని అభివృద్ధి చేసి ప్రజలందరికి సేవ చేసి విజయవంతముగా అయిదు సంవత్సరాల పదవి కాలం ముగియడంతో మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ హరిశంకర్ రెడ్డిని సన్మానించి, షీల్డ్ మరియు శాలువాతో సత్కరించడం జరిగింది.. ఈ కార్యక్రమం లో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి,బి ఆర్ ఎస్ నాయకులు మహేష్, మాధవి రఘుపతి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాదియాజావీద్ ఖాన్, రవీందర్ రెడ్డి, రామాంజనేయ రెడ్డి, జవహర్ రెడ్డి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెంగిచెర్ల మున్నూరు కాపు అధ్యక్షులుగా పిల్లి శ్రీకాంత్ పటేల్..!



**మేడిపల్లి వెలుతురు:**
చెంగిచెర్ల లో నూతనంగా మున్నూరు కాపు సంఘం కమిటీ ఏర్పాటు జరిగింది. కుల సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా అధ్యక్షులుగా పిల్లి శ్రీకాంత్ పటేల్ ను ప్రధాన కార్యదర్శిగా మాచర్ల శ్యాంసుందర్ పటేల్ ను కోశాధికారిగా దుంపల హరినాథ్ పటేల్ ను, గౌరవ సలహాదారులుగా సూర్య ప్రకాష్ రావు పటేల్ ను, సాయిబాబా పటేల్(MDF, TPUS) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)ను ఎన్నుకున్నారు.కమిటీ సభ్యులు గా పటేల్స్ రోట్టె సందీప్, చిర్యాల రమేష్, భాశెట్టి రామ్ చరణ్, జింగిలి శ్రీనివాస్, నూనె ప్రదీప్ సత్యనారాయణ, దానం కిరణ్ పంబి రాజేందర్, కొండ వెంకటేష్ , ఆకుల దుర్గాప్రసాద్, మిట్టపల్లి శ్రీనివాస్, అయినల రాంబాబు, పడాల భాస్కర్, రుకుమ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి గా ప్రతిమా సింగ్

ఆదిభట్ల, ఇబ్రహీం పట్నం, తుర్క యాంజల్, షాద్ నగర్ మున్సిపాలిటీ లు, మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ కు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు





**(రాపర్తి భాస్కర్ గౌడ్)**
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 27:**
రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారిగా సోమ వారం బాధ్యతలు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ పాలక వర్గాల పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించడం జరిగినది. రంగారెడ్డి జిల్లాలో 12 మున్సిపాలిటీలకు, మూడు కార్పొరేషన్లకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగినది. ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం, పెద్దఅంబర్ పేట్, షాద్ నగర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలకు, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లకు జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ప్రతిమా సింగ్ ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అదనపు కలెక్టర్ సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని తన ఛాంబర్ లో బాధ్యతలు చేపట్టారు.

# జర్నలిస్టుల విలువలను కాపాడండి...

- బోర్ల వద్ద జర్నలిస్టుల పేర్లు చెప్పే వారిపై చర్యలు తీసుకోవాలి...
- వత్తాసు పలుకుతున్న రెవిన్యూ సిబ్బందిపై ద్రుష్టి పెట్టండి...
- తహసిల్దార్ కు వినతి పత్రం అందించిన కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు..
- మా దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తాం: తహసీల్దార్ స్వామి..



**కూకట్ పల్లి జనవరి 27 వెలుతురు:**
జర్నలిస్టుల విలువలు దిగజార్చే విధంగా వ్యవహారిస్తున్న వారి పట్ల చర్యలు తీసుకోవాలని కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధి బృందం మండల తహసీల్దార్ కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం కేపీహెచ్బీ కాలనీలోని మండల తహసిల్దార్ స్వామి నాయక్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ బోర్లు వేసే దగ్గర కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. జర్నలిస్టుల పేరుతో సామాన్యులను బెదిరించడమే కాకుండా ఉన్నతాధికారులకు కూడా ఫోన్లు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. ఇది సరైన చర్యలు కావని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పేరు చెప్పుకొని బెదిరింపులకు పాల్పడుతున్న వారికి కొందరు రెవెన్యూ సిబ్బంది కూడా వత్తాసు పలుకుతున్నారని ఫిర్యాదు చేశారు. సామాన్యులను ఇబ్బందుల గురిచేయడంలో జర్నలిస్టుల ముసుగులో ఉన్నవారికి వత్తాసు పలుకుతున్న రెవిన్యూ సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నానాటికి దిగజారిపోతున్న జర్నలిస్టుల విలువలను కాపాడటంలో మండల మేజిస్ట్రేట్ గా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అడ్డదిడ్డంగా ఫోన్లు చేస్తూ ఇబ్బందుల గురి చేస్తున్న వారిపై కూడా కేసులు నమోదు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన తహసిల్దార్ స్వామి నాయక్ జర్నలిస్టుల సంఘాలు తీసుకుని నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కొందరు చేస్తున్న తప్పుడు పనులతో నిజమైన జర్నలిస్టులకు విలువ లేకుండా పోతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. జర్నలిస్టులు అందరు కలిసి తీసుకున్న నిర్ణయం మంచి పరిణామాలకు దారి తీస్తుందన్నారు. అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్న తమ సిబ్బందిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, సంఘం రాష్ట్ర నాయకులు దయసాగర్, నిమ్మల శ్రీనివాస్, లక్ష్మణ్ కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎం. ఏ కరీం, జర్నలిస్టుల సంఘం నాయకులు దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, గంగరాజు, చంద్ర, సదా మహేష్, మాణిక్య రెడ్డి, నాగరాజు, హరిబాబు, సాగర్ రెడ్డి, హరి, పవన్, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మందకృష్ణ మాదిగ గారికి పద్మశ్రీ అవార్డు గ్రహీత వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన మాదిగ జేఏసీ, వివిధ పార్టీల నాయకులు



**హైదరాబాద్ వెలుతురు జనవరి 27:**
మాదిగల ఆశాజ్యోతి ,ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ గారికి పద్మశ్రీ అవార్డు, గ్రహీత, వచ్చిన సందర్భంగా హైదరాబాదులో కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం గౌరవ అధ్యక్షులు బోసుపల్లి ప్రతాప్, నరుకుడి మహేందర్. మాజీ వార్డు సభ్యులు MRPS మండల్ ప్రధాన కార్యదర్శి జోగు అమరేందర్ నర్సింహా.గణేష్ సంజీవ శివకుమార్ విఘ్నేష్ సుధాకర్ హరీష్ లు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు

# గురునానక్ స్కూల్ లో పోటీల విజేతలకు పురస్కారాలు అందజేసిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామానుగౌడ్



**హైదరాబాద్ వెలుతురు జనవరి 27:**
ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవ సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్లోని విటల్వాడీలో ఉన్న గురునానక్ స్కూల్ లో జరిగినటువంటి పోటీల విజేతలకు సోమవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామానుగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై చేతుల మీదగా వారికి పురస్కారాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ సుందరి యాజమాన్యం మరియు స్టూడెంట్స్ పాల్గొన్నారు



# కెసిఆర్ గారి జన్మదినం పురష్కరించుకొని బిఆర్ఎస్వి ఆధ్వర్యములో కెసిఆర్ కప్ -2025 బ్రోచర్నీ విడుదల చేసిన కేటీఆర్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 27:**
తెలంగాణ భవన్ కెసిఆర్ గారి జన్మదినం పురష్కరించుకొని బిఆర్ఎస్వి ఆధ్వర్యములో కెసిఆర్ కప్ -2025..బ్రోచర్నీ సోమవారం రోజున తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌ కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది, ఈ కార్యక్రమములో బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు ,కార్యక్రమ నిర్వాహకులు కొంపెల్లి నరేష్, బిఆర్ఎస్వి నాయకులూ బోయపల్లినాగరాజు కువరపాల్లయ్య,రాజు తదితరులు పాలుగోన్నారు

# రావిరాలలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ..

**వెలుతురు, తుక్కుగూడ 27 జనవరి:**
తుక్కుగూడ మున్సిపాలిటీ పరి ధిలోని రావిరాల గ్రామంలో రూ.50 లక్షల నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన సో మవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుక్కుగూడ మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ తూర్పు అనిత జయరాజ్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గ్రామంలో నిరుపేదలు తమ కుటుంబ సభ్యు లు బంధుమిత్రులతో ఏదైనా శుభ కార్యక్రమాలు నిర్వహించుకు నేందు కు కమ్యూనిటీ హాల్ ఎంతో ఉప యోగపడుతుందని పేర్కొన్నారు. కమ్యూనిటీ నిర్మాణ పనులు నాణ్య త ప్రమాణాలతో నిర్మించాలని అది కారులను, కాంట్రాక్టర్లను సూచించా రు. 5 సంవత్సరాలుగా సహకరించి న ప్రజలకు ప్రజాప్రతినిధులకు పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియ జేస్తూ ఇక మీదట కుడా ప్రజల్లో ఉం టూ ప్రజా సమస్యల కోసం పోరాడు తు ప్రజల గొంతుగా ఉంటూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం



కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బరిగేలా హేమలత రాజు, మాజీ కౌన్సిలర్స్ బొద యాద గిరి రెడ్డి, ఏరుకల శివకుమార్, జప ల సుధాకర్ పాల్గొన్నారు.

# రైల్వే జీఎం కలిసిన ఎమ్మెల్యేలు, ఎంపీ

- కాజీపేట బస్ స్టాండ్ ఏర్పాటు మరియు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యేలు

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 27:**
హైదరాబాద్ సికింద్రాబాద్ రైల్వే భవన్ లో సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ జీఎం అరుణ్ కుమార్ జైన్,డీజీఎం ఉదయ్ నాథ్ కోట్ల ను సోమవారం మర్యాదపూర్వకంగా కలసిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ,వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్



రెడ్డి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ,శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య తదితరులు పాల్గొన్నారు ,ఖాజీపేట రైల్వే డివిజన్ మరియు కాజీపేట ఆవరణలో నూతన బస్ స్టాండ్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.రెండో అతిపెద్ద నగరమైన వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్ళాలంటే కాజీపేట మీదుగా వెళ్లాల్సి ఉంటుందని ప్రజా రవాణా దృష్ట ప్రజలు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.కాజీపేట ప్రధాన రహదారి వెంట ఉన్న రైల్వే స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కి కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం నూతన బస్ స్టేషన్ నిర్మాణానికి సిద్ధంగా ఉందని తెలియాజేశారు. ఖాజిపేట ప్రజల కోరిక కాజిపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనీ కోరారు.ఈ సందర్భంగా పై అంశలపై జీఎం అరుణ్ కుమార్ జైన్ సానుకూలంగా స్పందించారు.

# ఫిబ్రవరి 5 న సీఎం క్యాంపు ఆఫీస్ ముట్టడి కార్యక్రమం: సుర్వీ యాదయ్య గౌడ్

**వెలుతురు, హైదరాబాద్, జనవరి 27:**
సర్పంచుల పదవీకాలం అయిపోయిన నాటి నుంచి నేటి వరకు అనేకమైన శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన ప్రభుత్వం స్పందించకపోవడం వలన ఫిబ్రవరి 5న హైదరాబాద్ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముందు సర్పంచ్ల నిరసన కార్యక్రమం ను నిర్వహించనున్నట్లుగా రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తెలిపారు, సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశమై ఫిబ్రవరి 5న చలో సెక్రటేరియట్ ముందు నిరసన కార్యక్రమమును విజయవంతం చేయాలని యాదయ్య గౌడ్ పిలుపు నిచ్చారు,రాష్ట్రంలో అన్ని గ్రామాల తాజా మాజీ సర్పంచులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని యాదయ్య గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపా క నాగయ్య, రాష్ట్ర ఉ పా ధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి ,కొడంగల్ సర్పంచ్ రవీంద్ర నాయక్ ,పూర్ణ చందర్ గౌడ్ ,రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు,



## సీఎం పర్యటన ప్రదేశ స్థలాన్ని పరిశీలించిన ఏసీపీలు



**శంకర్పల్లి వెలుతురు జనవరి 27**
రేవంత్ రెడ్డి రేపు శంకర్పల్లి మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామ శివారులో గల ఎక్స్ పీరియమ్ పార్కు ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా పర్యటన ప్రదేశ స్థలాన్ని నార్సింగ్ ఏసిపి వెంకట్ రమణ గౌడ్, రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసిపి బాలాజీ పరిశీలించారు. CMతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు సినీ ప్రముఖులు రావడంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మోకిల, శంకర్పల్లి, చేవెళ్ల, సిఐలు, ఎస్ఐలు ఉన్నారు.

## మాజీ కౌన్సిలర్లను సన్మానించిన సింగాపురం వార్డు ప్రజలు






**శంకర్పల్లి వెలుతురు జనవరి 27**
శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని పదవ వార్డు మాజీ కౌన్సిలర్ బొడ్డు లావణ్య శ్రీనివాస్ రెడ్డి, ఒకటవ వార్డు మాజీ కౌన్సిలర్ సంతోష్ రాథోడ్ ల పదవీకాలం ఇటీవలే ముగిసింది. ఈ సందర్భంగా సోమవారం పంచముఖ హనుమాన్ ఆలయ ఆవరణలో మాజీ కౌన్సిలర్లకు వార్డు ప్రజలు శాలువాలతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మాపై నమ్మకంతో కౌన్సిలర్ లుగా గెలిపించిన వార్డు ప్రజలకు, సేవ చేసే భాగ్యం కల్పించినందుకు రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. వారిని సన్మానించిన వారిలో సుధాకర్ రెడ్డి, అంజిరెడ్డి, దయాకర్ రెడ్డి, దేవయ్య, కృష్ణ, శేఖర్ రెడ్డి, పోచయ్య, భాస్కర్, సురేష్, మల్లేష్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## డా.త్రినాధరావుకు మరో రెండు గౌరవ డాక్టరేట్లు



**వెలుతురు, సిటీ కల్చరల్ :** ఎపిఫైజో ప్రోఫెటిక్ బైబిల్ యూనివర్సిటీ, సౌత్ ఆఫ్రికా వారు హైదరాబాదు కళాకారుడు "అంతర్జాతీయ గాన కళారత్న" డా.త్రినాధ రావుకు రెండు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు త్రినాధరావును "డాక్టర్ ఆఫ్ ఫిలా సఫీ" డాక్టర్ ఆఫ్ డివినిటీ గౌరవ డాక్టరేట్లతో సత్కరించారు. సాం స్కృతిక రంగంలో విశేష సేవ అందిస్తున్న తమను గుర్తించి రెండు యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకోవడం తమకు మరింత బాధ్యత పెరిగిందని ఆనం దం వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా పలువురు ప్రముఖులు త్రినాధ రావుకు అభినందనలు తెలియజేశారు.

## నూతన అంబులెన్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే

- కిష్టాపూర్ లో సీసీ రోడ్డు ప్రారంభం
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం
- ఎమ్మెల్యే సున్నిత లక్ష్మారెడ్డి







**కొల్చారం, వెలుతురు న్యూస్ జనవరి 27:**
నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి సోమవారం కొల్చారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని కిష్టాపూర్ లో తాజా మాజీ సర్పంచ్ గోదావరి ఆధ్వర్యంలో రూపాయిలు నాలుగు లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాజీ సర్పంచ్ గోదావరి నిలబాటిల్లు, ప్లేట్లు బహుమతి చేయగా ఎమ్మెల్యే చేతుల మీదుగా వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. అటునుండి మండల కేంద్రమైన కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని నూతన అంబులెన్స్ ను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దవాఖానాలోని ప్రతి గదిని తిరిగి చూశారు. దావఖానలో అందిస్తున్న వైద్య సేవలు, మందులు, సిబ్బంది వివరాలను డాక్టర్ రమేష్ ను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సిబ్బంది కొరత ఉన్నట్లు ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో జిల్లా మంత్రిని కోరగానే కొల్చారం వెల్దుర్తి మండలాలకు రెండు అంబులెన్స్లను మంజూరు చేశారని తెలిపారు. కొల్చారంలో రోడ్డు ప్రమాదాలు జరిగితే అంబులెన్స్ రావడానికి చాలా సమయం పట్టేదని, ఇప్పుడు ఆ సమస్య తీరింది అన్నారు. కొల్చారంలో ప్రసూతి సేవలు ప్రారంభించాలని అందుకు కావలసిన సదుపాయాలను, ఇతర అవసరాలను తనకు లేక ద్వారా అందించాలని డాక్టర్ రమేష్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గఫర్ మియా, ఆర్ఐ ప్రభాకర్, ఎం పి హెచ్ ఈ ఓ మదన్మోహన్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా, మాజీ జెడ్పిటిసి కాశం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, తుంకులపల్లి సంతోష్ రావు, కరెంటు రాజా గౌడ్, సిహెచ్ కృష్ణ, వై కృష్ణ, చిన్న రాములు, లింగోల చెన్నయ్య, సాయిబాబాగౌడ్, వినోద్ నాయక్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన డిప్యూటీ తాసిల్దార్ రాజు పటేల్



వెలుతురు నారాయణఖేడ్ జనవరి 27 :
నారాయణఖేడ్ మండలంలోని తాసిల్దార్ కార్యాలయంలో నూతన క్యాలెండర్ ఐస్కరించిన డిప్యూటీ తాసిల్దార్ రాజు పటేల్ ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ నూతన సంవత్సర 2025 క్యాలెండర్ ఆవిష్కరించారు కంప్యూటర్ ఆపరేటర్లు ఓటర్ నమోదు ప్రక్రియ వేగవంతం కూడా చేయడం మారుమూల ప్రాంతాల్లో కూడా ఓటర్లను అవగాహన కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తుంది అన్నారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్ జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ జైపాల్ మాణిక్ నాయక్ కిషన్ నదీమ్ ధరణి ఆపరేటర్ రాజు మీ సేవ ఆపరేటర్ కృష్ణ ఏఐటియుసి నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగకి పద్మశ్రీ అవార్డు లభించిన హర్షణీయం



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 27:**
గత మూడు దశాబ్దాలుగా నిర్విరామంగా మాదిగ, మాదిగ ఉపకులాల అభ్యున్నతి కోసం సామాజిక న్యాయం కోరుతూ అలుపెరుగని పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగకి పద్మశ్రీ అవార్డు లభించడం ఆయనకు దక్కిన అరుదైన గౌరవం. అలాగే ఇటీవలే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ పై తీర్పు ఇచ్చిన తర్వాత మాలలు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టడం కోసం ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాదు నగరంలో లక్ష డప్పులు వెయ్యి గొంతులు అనే కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ గారు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పొట్ట వెంకటేష్ మందకృష్ణ మాదిగకి పద్మశ్రీ లభించడం కూడా గొప్ప విషయమని యావత్ మాదిగ సమాజానికి దక్కిన గౌరవంగా భావించాలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి వర్గీకరణ బిల్లును దేశంలోనే మొదట అమలు చేస్తామన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాల్లో ఎస్సి వర్గీకరణను అమలు చేయలేదు. మాదిగ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతూనే ఉన్నది. తక్షణమే ఎస్సి వర్గీకరణ బిల్లును అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ముత్యాల చంద్రకాంత్, వలిగొండ యాదయ్య, సుక్క భాస్కర్, రేవనపల్లి బుగ్గ రాములు, రేవనపల్లి కిషోర్, చెరుకుపల్లి భాస్కర్, రేవనపల్లి గోపాల్, వలిగొండ మాధవులు, చెరుకుపల్లి శ్రీకాంత్, జనగాం సంజీవ, వడ్డేపల్లి వంశీ, చెరుకుపల్లి శివ, ఏర్పుల సైదులు, పొట్ట లింగస్వామి, రేవనపల్లి చంద్రయ్య, వలిగొండ లింగస్వామి, రేవనపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బంజారా భవనం కోసం భూమిని కేంటాయించాలని కలెక్టర్ కి వినతి.



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 27:**
సంస్థాన్ నారాయణపురం మండలంలో సంత్ సేవా లాల్ బంజారా భవనం నిర్మించుటకు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు భూమిని కేటాయించాలని అల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బిక్షపతి నాయక్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. మండల కేంద్రంలో రెండు ఎకరాల భూమి కేటాయింపు కోసం సర్వే చేసి రిపోర్టు ఇవ్వాల్సిందిగా ఆర్డీవో కి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కరంటోతు శ్రీనివాసు నాయక్ , బానోతు కిషన్ నాయక్, జరుపల జగన్, కాట్రోతు సాగర్ జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ నెంబర్ పానుగోడు బాలు నాయక్, శ్రీరామ్ నాయక్, గోపి నాయక్ , రాంసింగ్ నాయక్ , శ్రీధర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం గ్రామానికి మహిళలు భారీ ర్యాలీ



**కొండ రెడ్డిపల్లి వెలుతురు జనవరి 27:**
విన్నపం ఒక పోరాటం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆధ్వర్యంలో జనవరి 26 ఇందిరా పార్క్ నుంచి ముఖ్యమంత్రి స్వగ్రామం కొండ రెడ్డిపల్లి వరకు కారు ర్యాలీ ప్రభుత్వ పరిమిషన్తో ఆ గ్రామానికి చేరుకోవటం జరిగింది. మా డిమాండ్ అవసరానికి అవసరమైన విద్యార్థులకు,మహిళలకు ఆర్గానిక్ పార్ట్స్ రేషన్ షాపుల ద్వారా అందించాలని, చట్ట సభలో మహిళలకు 50% రిజర్వేషన్ ప్రకారం అమలు చేస్తూ ఎన్జీవో పనిచేస్తున్న మహిళలకు ఎమ్మెల్సీ కేటాయించాలని, నెలసరి సమయంలో మూడు రోజులు సెలవులు ప్రకటించాలని, రోజుకి రోజుకు మహిళలపై హత్యలు అత్యాచారాలను ఎక్కువైతున్నాయి వాటిని కట్టడి చేసే బాధ్యతఊది. ప్రభుత్వం మహిళా దినోత్సవం మార్చి 8 వీటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నిర్వహించాము . ఈ కార్యక్రమం సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ సీఈవో పరమేశ్వరి, ప్రొఫెసర్ మొగులపల్లి బాగయ్య అధ్యక్షాలో , అధ్యక్షులు మీనం గోపి బోయ, నమిత, శారద, మధులత, నిర్మల, మంజుల హైకోర్టు అడ్వకేట్లు, రోజా కుమారి బీసీ నేత, ధనలక్ష్మి, నాగుల శ్రీనివాస్ యాదవ్ హైకోర్టు అడ్వకేట్, సత్యనారాయణ, నరసయ్య, బడే సాయి, వెంకటస్వామి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# భేటీ బచావో భేటీ పడావో అని బాలికల విద్యను ప్రోత్సహించడానికి సైకిళ్ల పంపిణీ

- ఉదారత చాటిన డివైన్ వరల్డ్ సోషల్ సర్వీస్ సొసైటి
- డివైన్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులను అభినందించిన డిఈఓ రాధాకృష్ణ





**తూప్రాన్,వెలుతురు జనవరి 27:**
భేటీ బచావో భేటీ పడావో అని బాలికల విద్యను ప్రోత్సహించడానికి సుదూర ప్రాంతాల నుండి విద్యను అభ్యసించడానికి కాలి నడకన వస్తున్న విద్యార్థీనీలకు సైకిళ్ల పంపిణీ చేసి ఉదారత చాటిన డివైన్ వరల్డ్ సోషల్ సర్వీస్ సొసైటి స్వచ్ఛంధ సంస్థ ప్రతినీదులను డిఈఓ రాధాకృష్ణ అభినందించారు. సోమవారం తూప్రాన్ బాలికల ఉన్నత పాఠశాలలో 6 గురు విద్యార్థినిలకు, అలాగే ఇస్లాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 6గురు విద్యార్థినిలకు కలిపి మొత్తం 12 మందికి 12 సైకిళ్ల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఈఓ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించి ఉత్తమ ఫలితాలు సాధించింది గణనీయమైన మార్పు రావడం మెదక్ జిల్లా కే గర్వకారణంగా నిలిచారనీ అన్నారు. ఇలా ప్రోత్సహించడం తో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా విద్యా శాఖ అధికారి రాధాకృష్ణ, మండల విద్యా శాఖ అధికారి సత్యనారాయణ, డివైన్ వరల్డ్ సోషల్ సర్వీస్ సొసైటి స్వచ్ఛంధ సంస్థ ప్రతినిదులు మొజెస్, ప్రిన్స్ పాల్ వినీత్, సమీర్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జానకిరామ్, ఏఏపిసి చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం యువజన కార్యదరిగా ఎన్నికైన నరేష్ పాటిల్...



**జహీరాబాద్ వెలుతురు జనవరి 27:**
సంగారెడ్డి లో జరిగిన వీరశైవ లింగాయత్ జిల్లా సమావేశంలో జహీరాబాద్ పట్టణానికి చెందిన నరేష్ పాటిల్ ను వీరశైవ లింగాయత్ సమాజం, సంగారెడ్డి జిల్లా యువజన కార్యదరిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా యువజన కార్యదరి పదవికి ఎన్నికైనందున నేను వీరశైవ లింగాయత్ జిల్లా సమాజ అభివృద్ధికి మరియు పటిష్టతకు విశ్వగురు బసవన్న చూపించిన మార్గంలో కార్యవర్గముతో కలుపుకొని, పెద్దల సహకారంతో కృషి చేస్తానని, అంత:కరణ శుద్ధితో, రాగద్వేషాలకు, అతీతంగా పని చేస్తానని ప్రమాణం చేశారు. ఈ సందర్బంగా వారు జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సిములు, యువజన అధ్యక్షులు మల్లికార్జున్, కార్యనిర్వాహ అధ్యక్షులు ప్రశాంత్ పాటిల్ లకు, జిల్లా కార్యవర్గనికి ప్రతేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

## రైతు రాజ్యం అచ్చేదేప్పుడు షార్ట్ ఫిలింను రిలీజ్ చేసిన మహా ఐ కంపెనీ సీఈఓ, ఎన్నారై చింతం నరేందర్



**కరీంనగర్ జిల్లా వెలుతురు జనవరి 27:**
బిజెపి రాష్ట్ర నాయకులు , తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సొల్లు అజయ్ వర్మ నటించి , స్వీయ నిర్మాణంలో , అక్కన భాస్కర్ దర్శకత్వంలో రూపొందించిన రైతు రాజ్యం ఆచ్చేదేప్పుడు షార్ట్ ఫిలింను సోమవారం రోజున తిమ్మాపూర్ మండలం మక్తపల్లిలో మహా ఐ కంపెనీ సీఈఓ, ఎన్నారై చింతం నరేందర్ రిలీజ్ చేశారు. రైతుల కష్టనష్టాలు, నకిలీ విత్తనాలు ,వ్యవస్థ దళారి వ్యవస్థ, రైతుల కన్నీళ్ల ఇతివృతంగా షార్ట్ ఫిలిం రూపొందించడం జరిగిందని నటుడు నిర్మాత సొల్లు అజయ్ వర్మ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకుడు అందెసురేష్ ,పెంట చంద్రయ్య, దోనపాటి అనిల్ రెడ్డి ,రాగుల రమణారెడ్డి, పెంటసాగర్ భామండ్ల, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనీషా వలలో కరెంట్ ఏఈ

### 20వెలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఏఈ



**కాల్లాకల్ వెలుతురు జనవరి 27:**
విద్యుత్ శాఖ ఏఈ 20 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా అవినీతి నిరోధక శాఖ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ సంఘటన మెదక్ జిల్లా కాళ్ళకల్ 33/11 కెవి సబ్ స్టేషన్ లో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే కాల్లాకల్ సబ్ స్టేషన్ లో విద్యుత్ ఏ.ఈ గా పనిచేస్తున్న చిర్ర కృష్ణ ఏసీబీ కి చిక్కారు. కాళ్ళకల్ లో లక్కీ ఇండస్ట్రీ అనే నూతన పరిశ్రమ కోసం ట్రాన్స్ పార్మర్ నుండి విద్యుత్ సరఫరా కోసం 20 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హైండ్ గా పట్టుపడ్డ సంఘటన చోటుచేసుకుంది. మనోహరబాద్ మండలం కాళ్లకల్ విద్యుత్ ఏఈ కృష్ణ కాళ్లకల్ పారిశ్రామిక వాడ లోని కొండాపూర్ లో లక్కీ నూతన పరిశ్రమ ఏర్పాటుకు సంజయ్ ఘోష్ 125 ట్రాన్స్ఫార్మర్ నుండి విద్యుత్ సరఫరా కోసం వెళ్లగా ప్రభుత్వనికి కట్టాల్సిన డిడి లు కడుతూ లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10 వేలు ఇవ్వగా ఇంకా డబ్బులు కావాలంటూ డిమాండ్ చేసారు. లంచం ఇవ్వడం ఇష్టం లేక అవినీతిశాఖ ను ఆశ్రయించారు. సంజయ్ ఘోష్ సోమవారం రోజు కాళ్లకల్ విద్యుత్ కార్యాలయంలో కి వెళ్ళి ఏఈ ఎర్ర కృష్ణ కు 20 వేలు నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హైండ్ గా పట్టుకున్నారు. గత నాలుగు సంవత్సరాలు గా కాళ్ళకల్ సబ్ స్టేషన్ లో ఏఈ గా పని చేస్తూ అవినీతి కి పాలుపడి ఏసీబీ వలలో చిక్కుకున్నారు. మెదక్ రేంజ్ ఏసీబీ డిఎస్పీ సుదర్శన్ కాళ్లకల్ విద్యుత్ శాఖ ఏఈ కృష్ణ ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. విచారణ అనంతరం రిమాండ్ కు తరలించనున్నట్లు తెలిపారు.

## శివ స్వాములు కాలినడకన ఎడపాయలకు



**కొల్చారం, వెలుతురు న్యూస్ జనవరి 27:**
మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామంలో శివ మాల ధరించిన శివ స్వాములు ఆధ్వర్యంలో తుక్కాపూర్ గ్రామం నుండి సుమారు 50 మంది ప్రసిద్ధ క్షేత్రమైన శ్రీ ఏడుపాయల దుర్గామాత దేవస్థానానికి కాలినడకన బయలుదేరారు. అక్కడ దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివ స్వాములకు తుక్కాపూర్ బిఆర్ఎస్ నాయకుడు దొడ్ల ఆంజనేయులు భోజన సదుపాయం సమకూర్చారు. ఈ కార్యక్రమంలో శివ స్వాముల తో పాటు తుక్కాపూర్ గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## మాస శివరాత్రి ప్రత్యేక పూజలు



**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 27 :**
నారాయణఖేడ్ పట్టణ చారిత్రాత్మిక కాశీనాథ్ ఆలయ శివ స్వాములు మాస శివరాత్రి సందర్భంగా సోమవారం రోజున పట్టణంలోని కాశీనాథ్ మందిర్, నగరేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు నాగిశెట్టి, శ్యామ్ రావు, సుభాష్, గుజ్జేటి శ్రీనివాస్ లు మాట్లాడుతూ మాస శివరాత్రి ఆ బోలా శంకర్ కి ప్రీతిపాత్రమైన రోజని చెప్పారు. ఈ రోజున శంకరుని ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో శివస్వాములు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు

### విగ్రహాన్ని ఆవిష్కరించిన మేయర్ సునీల్ రావు..



**కరీంనగర్ వెలుతురు జనవరి 27:**
ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తీగల గుట్టపల్లి లో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్నిసోమవారం రోజున మేయర్ సునీల్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్ రావు , కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ అభ్యున్నతి కోసం ఆలోచన చేసిన మహనీయుల్లో అంబేద్కర్ ఒకరన్నారు. దేశానికి అంబేద్కర్ చూపిన మార్గం,రాజ్యాంగం నేడు దిక్సూచిలా మారిందన్నారు. అంటరానితనం, కుల వివక్ష , స్వేచ్ఛ, సమానత్వం పై అంబేద్కర్ అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. విగ్రవిష్కరణ కార్యక్రమ సందర్భంగా కార్పొరేటర్ శ్రీనివాస్ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు రాపర్తి విజయ, బండ సుమా రమణారెడ్డి, సతీష్ , దురిశెట్టి అనుప్, కాసర్ల ఆనంద్ బిజెపి మీడియా కన్వీనర్ కటకం లోకేష్, కైలాస నవీన్ , తెలంగాణ అంబేద్కర్ సంఘం తీగలగుట్టపల్లి నాయకులు జంగపెల్లి వినోద్ కుమార్ ,జకినపల్లి రాజు ,నెరవట్ల మధు ,నీరుకుల్ల మహేందర్,కన్నం నవీన్ , కొంకటి ప్రవీణ్ ,నీరుకుల్ల కళ్యాణ్ , జంగం వినయ్,ఆరెపల్లి సిద్ధార్థ్ లతోపాటు మాజీ సర్పంచ్ జంగపల్లి మల్లయ్య ,కవంపల్లి రవీందర్,నీరుకుల్ల అనిల్ కుమార్ అంబేద్కర్ సంఘం నాయకులు రాష్ట్ర నాయకులుసుద్దాల లక్ష్మణ్ సముద్రాల అజయ్,జిల్లాఅధ్యక్షులు గొష్కి శంకర్ ,రాష్ట్ర కార్యదర్శి గజ్జల ఆనందరావు రాష్ట్ర ప్రణాళిక టి ఏ వై ఎస్ సంఘం అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

## మంగళపల్లి లో విద్యార్థులు, మహిళా లకు అవగాహన కల్పించిన పోలీసులు



**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, జనవరి 27:**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంగళపల్లి గ్రామంలోని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో డయల్ 100, డ్రగ్స్, షి టీమ్, సోషల్ మీడియాలపై హాస్టల్ లో నివసించే విద్యార్థినీలకు, పెయిన్ గెస్ట్ మహిళలుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులందరికీ 100 నెంబర్ పై అవగాహన ఉండాలన్నారు. ర్యాగింగ్, టీసింగ్ అని ఎవరైనా వేధిస్తే సమాచారం అందిం చాలన్నారు. బాలికలందరూ ఆత్మస్థైర్యంతో ఉండాలని, నేరం జరిగినప్పుడు మహిళలు భయపడకుండా ముందుకు వచ్చి డయల్ 100 కు కాల్ చేసి జరిగిన సంఘటనల గురించి ధైర్యంగా సమాచారం ఇవ్వాలన్నారు. షి టీమ్స్ పై విద్యార్థిని తో మాట్లాడిస్తూ.. బాలికల భద్రతే షీ టీమ్స్ లక్ష్యమన్నారు. పాఠశాలలో కానీ, బయట ఎక్కడైన ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురి చేసినా, వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 100,1930సైబర్, 8712662111 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాలికలను, మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు చిన్న విషయాలకు ఆవేద నకు గురికాకూడదని మంచి ఆలోచనతో చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనపై కూడా దృష్టి సారించాలన్నారు. క్రమశిక్షణతో ఉండేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అంతర్జాలం వాడుతున్న ఆప్స ఇన్స్టాగ్రాం , ఫేసుబుక్ , వాట్సప్ , షేరు షాట్ వంటి యాప్స్ పై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో ఫ్రెండ్ రిక్వెస్ట్ లు, ఫాలోవర్స్ రూపంలో తెలియని వ్యక్తులు, తెలియని ఐడీలతో ఫాలో కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాలు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సంబంధించిన వీడియోలు మరియు సైబర్ క్రైమ్ పై హాజరైన విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ అవగాహన మీలో ఉన్నపుడే సైబర్ నేరాల బారిన పడకుండా ఉండగలమని, కావున ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన ఏర్పరచుకొని సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐ మధు, ఎస్సై రామకృష్ణ, శిరీష, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# జాతీయ ప్రధాన కార్యదర్శిగా తప్పుకుంటా

- పార్టీలో కొత్తవారికి ఎక్కువ అవకాశాలు ఇస్తాం
- దావోస్‌లో పెట్టుబడుల కోసం కృషి చేశాం
- రెడ్‌బుక్ ప్రకారం చర్యలు తప్పవన్న లోకేశ్



**విశాఖపట్టణం,జనవరి27( వెలుతురు):**

ఇకపై పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి పదవి తీసుకోనని, పార్టీకోసం పనిచేస్తానని మంత్రి లోకేశ్ అన్నారు. తనతో పాటు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా పదవి తీసుకోరని అన్నారు. పార్టీలో కొత్తవారికి అవకాశం కల్పించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. సాక్షిపై పరువు నష్టం కేసులో విశాఖ కోర్టుకు ఆయన హాజరయ్యారు. కేసు విచారణ ఫిబ్రవరి 28కి వాయిదా పడింది. కోర్టుకు హాజరైన అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు. 2019లో సాక్షి పత్రిక తనపై అసత్య ఆరోపణలు చేసిందని మంత్రి నారా లోకేశ్తెలిపారు. అప్పుడే వారికి లీగల్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. గత ఐదు సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేస్తున్నాను.. ఇది నాలుగో వాయిదా. నిజం నా వైపు ఉంది.. ఎన్ని సార్లయినా వస్తాను. ఆలస్యమైనా నిజం గెలుస్తుంది. ఈరోజు కూడా మంత్రి హోదాలో నేను వచ్చినప్పుడు పార్టీ ఆఫీసులో బస్సులో పడుకొని సొంత భోజనం తిన్నాను. ప్రభుత్వం నుంచి ఒక్క వాటర్ బాటిల్ కూడా తీసుకోలేదు. వచ్చిన వాహనం కూడా నాదే. సొంత డబ్బుతో డీజిల్ కొట్టించుకున్నా. ఎక్కడా ప్రభుత్వంపై ఆధారపడకూడదని నా తల్లి భువనేశ్వరి చిన్నప్పటి నుంచి నేర్పించారు. సీఎం చంద్రబాబు నాకు ఏ బాధ్యత ఇచ్చినా అహర్నిశలు కష్టపడతా. నావల్ల పార్టీకి ఏనాడూ చెడ్డపేరు రాకుండా చూసుకుంటా. 'యువగళం' పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు చర్యలు తీసుకుంటాం. తల్లి, చెల్లినే నమ్మని జగన్.. ఎవరినీ నమ్మరు. డబ్బు కోసం ఆయన పార్టీనే అమ్మేసే రకం. ఇవన్నీ చూసే ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. మా పార్టీని, కార్యకర్తలను విజయసాయిరెడ్డి ఇబ్బంది పెట్టారు. అలాంటి వ్యక్తి తెదేపాలోకి వస్తానంటే ఎందుకు తీసుకుంటాం?విశాఖలో విజయసాయి చేసిన అక్రమాలపై విచారణ జరుగుతోంది. రెడ్‌బుక్ గురించి నేను చెప్పిన విషయం చాలా స్పష్టం. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయి' అని లోకేశ్ అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ టీమ్ దావోస్ పర్యటనపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్న వేళ.. మంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు.. ఏడు నెలలలో ఆరు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తీసుకొచ్చామని స్పష్టం చేశారు.. ఇక, 2019లో బ్లూ మీడియా నాపై అసత్య కథనం ప్రచురించింది. తప్పుడు కథనంపై సమాధానం చెప్పాలని అప్పుడే నేను లీగల్ నోటీసు జారీ చేశాను అన్నారు.. మరోవైపు.. తన పాదయాత్రకు రెండేళ్లు అయిన సందర్భంగా.. రాజకీయాలలో పాదయాత్ర ఎంబీఏ లాంటిది అని పేర్కొన్నారు.. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటు వస్తున్నాము. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు పై విచారణ జరుగుతుంది. విశాఖలో జరిగిన అక్రమాలపై కూడా విచారణ సాగుతోంది.. అన్ని వ్యవహారాలపై విచారణ ఒకేసారి జరిగితే ఉన్న పోలీసులు సరిపోరు. క్రమంగా అన్నింటిపై విచారణ జరుగుతుందన్నారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1997 నుంచి దావోస్ కి వెళ్తున్నారని గుర్తుచేసిన ఆయన.. గత ప్రభుత్వంలో ఒప్పందాలు జరిగితే ఎందుకు పరిశ్రమలు స్థాపించలేకపోయారని నిలదీశారు.. మహారాష్ట్రకు ఎక్కువ పెట్టుబడుల రావడానికి కారణం ఒకే ప్రభుత్వం కొనసాగడంగా పేర్కొన్న ఆయన.. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెట్టుబడులు పెట్టిన సంస్థల ప్రతినిధులను గతంలో జగన్మోహన్ రెడ్డి కలవలేదని దుయ్యబట్టారు.. గుజరాత్ లో 5వ సారి బీజేపీ ప్రభుత్వం రావడం వలన అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు..మన రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు అభివృద్ధిని పరుగులు పెట్టించాం.. రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి గెలవాల్సి ఉందన్నారు. చంద్రబాబు పై మాకు నమ్మకం ఉంది.. కానీ, రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గెలవలేరు అని హామీ ఇవ్వగలరా? అని దావోస్ ప్రతినిధులు అడుగుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు.. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలి. పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి తీసుకురావడానికి చాలా కష్టపడుతున్నాం అన్నారు.. మరోవైపు.. రోజాపై సెటైర్లు వేసిన లోకేష్.. అసలు రోజా కు దావోస్ కు జ్యూరిచ్ కు తేడా తెలియదు అని ఎద్దేవా చేశారు.. రెడ్ బుక్ కోసం ఎందుకు వైసీపీ నాయకులు భయపడుతున్నారని ప్రశ్నించారు.. ఇక, విశాఖలో 90 రోజులలో టీసీఎస్ ను ఏర్పాటు చేస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు.

## కుంభమేళాలో స్నానం చేసినా పాపం పోదు

- మోడీ, అమిత్ షాలు ఖచ్చితంగా నరకానికే పోతారు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,జనవరి27( వెలుతురు):**



మహాకుంభమేళా సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా గంగా నదిలో మునిగితే కచ్చితంగా నరకానికే వెళ్తారు అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నేడు అమిత్ షా మహాకుంభమేళాలో పవిత్ర స్నానాలు చేశారు. ఫిబ్రవరి 5వ తేదీన మహాకుంభమేళాకు ప్రధాని మోడీ రానున్నారు. ఈ సందర్భంగా ఖర్గే సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'గంగానదిలో స్నానం చేయడం వల్ల పేదరికం పోతుందా? అది ఆహారాన్ని అందిస్తుందా? నేను ఎవరి విశ్వాసాన్ని దెబ్బతీయాలని అనుకోవడం లేదు. నా మాటలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే నేను క్షమాపణలు కోరుతున్నాను. కానీ పిల్లలు ఆకలితో చనిపోతున్నప్పుడు, పాఠశాలకు వెళ్లలేకపో తున్నప్పుడు, కార్మికులకు జీతం అందనప్పుడు, బిజెపి నేతలు గంగలో స్నానం చేయడానికి పోటీపడుతున్నారు. వారు టీవీల్లో పబ్లిసిటీ కోసమే ఇదంతా చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తుల నుండి దేశం ప్రయోజనం పొందదు. ప్రధాని మోడీ, అమిత్‌షా ఎన్నో తప్పులు చేశారు. అలాంటి వ్యక్తులు కుంభమేళాలో స్నానం చేస్తే విముక్తి రాదు. వారు కచ్చితంగా నరకానికి వెళ్తారు' అంటూ వ్యాఖ్యానించారు. ఈగా, ఖర్గే వ్యాఖ్యలపై బిజెపి నేతలు కౌంటరిస్తున్నారు. ఖర్గే సనాతన ధర్మంపై దాడి చేశారని బిజెపి అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు. ఖర్గే వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని, దీనిపై కాంగ్రెస్ పార్టీ వివరణ ఇవ్వాలని ఆయన అన్నారు.

# కేంద్రమంత్రి కట్టర్ ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన కోతి రాంపూర్ ప్రజలు..

## బిజెపి నేత మాసం గణేష్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రులు కట్టర్, బండి సంజయ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం..

**కరీంనగర్ వెలుతురు జనవరి 27:**

కోతి రాంపూర్ ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిన డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామని కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ హామీ ఇవ్వడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలను ఇబ్బంది పెడుతూ, వేధిస్తున్న డంపింగ్ యార్డ్ కు సమస్యకు పరిష్కారం లభించేలా కృషి చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కి, ఎంత ఖర్చయినా కేంద్రమే భరిస్తుందని ఇటీవల కరీంనగర్ బహిరంగ సభ వేదికగా హామీ ఇచ్చిన కేంద్రమంత్రి కట్టర్ కి కృతజ్ఞతలు తెలుపుతూ సోమవారం రోజున కోతి రాంపూర్ బిజెపి నేత మాసం గణేష్ ఆధ్వర్యంలో స్థానికగాంధీ విగ్రహం వద్ద సంబరాలు చేపట్టి, కేంద్ర మంత్రులు కట్టర్, బండి సంజయ్ కుమార్ ల చిత్రపటాలకు పాలాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు కల్లెం వాసుదేవ రెడ్డి, మాసం గణేష్ లు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా డంపింగ్ యార్డ్ వల్ల కోతి రాంపూర్ ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారని , ముఖ్యంగా అనారోగ్యాల బారిన పాడిన ప్రజలు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. డంపింగ్ యార్డ్ తో కోతి రాంపూర్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఈ సమస్యపై అనేకసార్లు పోరాటాలు, విజ్ఞప్తులు చేసిన ఏ ఒక్కరూ పట్టించుకోలేదన్నారు. ఇటీవల కరీంనగర్ పట్టణంలో జరిగిన బహిరంగ సభ వేదికగా కేంద్రమంత్రి కట్టర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రకటన చేసిన నేపథ్యంలో కోతి రాంపూర్ ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ డంపింగ్ యార్డ్ సమస్యను కేంద్రమంత్రి కట్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేసినందుకు కోతి రాంపూర్ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఇట్టి కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, సౌత్ జోన్ కన్వీనర్ గాయత్రి, జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ శివానందం, మోహన్, కిరణ్, రమేష్ ,సాగర్ సాయిరాం ,లింగమూర్తి ,సందీప్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



# రంగారెడ్డి కలెక్టరేట్ ప్రజావాణికి (67) ఫిర్యాదులు



**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, జనవరి 27:**

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (67) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ - 51, ఇతర శాఖలు - 16, మొత్తం 87 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమన్వయ సమావేశంలో జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు పథకాల వివరాలు గ్రామ పంచాయతీల వారీగా, మున్సిపాలిటీల వార్డుల వారీగా నమోదు చేయాలన్నారు. రానున్న ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలలో, హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలని అన్నారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి జిల్లా ఉత్తమ స్థానంలో నిలిచే విధంగా ప్రణాళిక రూపొందించుకొని ముందుకెళ్ళన్నారు. గణతంత్ర దినోత్సవం వేడుకల్లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులందరు సమన్వయంతో పని చేసి గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేసినందుకు అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు,

# మున్సిపల్ ఆఫీస్ లో పని చేయని పంచింగ్ మిషన్: బీఎస్పీ నేత గ్యార మల్లేష్

**వెలుతురు, పెద్ద అంబర్ పేట్, జనవరి 27:**

పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీలో పంచింగ్ మిషన్ పని చేయడం లేదని బీఎస్పీ నేత గ్యార మల్లేష్ ఆరోపించారు,ఉద్యోగస్తులు ఏ సమయానికి వస్తారో ,ఏ సమయానికి వెళ్తారో తెలియజేయడం కోసం ఈ పంచింగ్ మిషన్ ఏర్పాటు చేశారని కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ మిషన్ పని చేయడం లేదన్నారు,ఇప్పుడు ఈ పంచింగ్ మిషన్ పనిచేయకుండా పోయిన విషయం తెలిసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించారని మల్లేష్ ఆరోపించారు, పంచింగ్ మిషన్ పని చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలనిమల్లేష్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో మున్సిపల్ ఆఫీస్ ముట్టడి చేస్తామని మల్లేష్ హెచ్చరించారు . తాము అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులపై మల్లేష్ మండి పడ్డారు,



# గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

**విశాఖపట్టణం,జనవరి27( వెలుతురు):**

దువ్వాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మన్నెం రవి (56) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఇక్కడి ముస్తఫా జంక్షన్‌లో నివాసం ఉంటున్న ఆయన ఇంటి నుంచి విధుల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై వెళు తుండగా మార్గమధ్యంలో గుండెపోటు రావడంతో రోడ్డు పక్కల వాహనాన్ని ఆపారు. దీంతో స్థానికులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవి మృతి చెందారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన మన్నెం రవి 1991 బ్యాచ్‌కు చెందినవారు. ఇటీవలే బదిలీపై దువ్వాడ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. హెచ్‌సీ మృతదేహాన్ని ఏసీపీ టి.త్రినాథ్, సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ వెంకటరావు, ఏఎస్ఐలు, సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. రవికి భార్య, ఇద్దరు కుమార్తెలు. ఒకఅమ్మాయికి వివాహం చేయగా, మరో కుమార్తె బీటెక్ చదువుతుంది. కాగా రవి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం పాయకరావుపేటకు తరలించారు.



## భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మశ్రీ అవార్డుకి ఎంపికైన మందకృష్ణ మాదిగ గారికి శుభాకాంక్షలు తెలిపిన నూకం సంజయ్ ముదిరాజు,తదితరులు


**హైదరాబాద్ వెలుతురు జనవరి 27:**

# ప్రజలే ఫస్ట్ నినాదంతో ముందుకు వెళ్లాలి

- అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి,జనవరి27( వెలుతురు):**

'ప్రజలే ఫస్ట్' అనే విధానంలో ప్రజల అభిప్రాయాలు, అంచనాల మేరకు పనిచేయాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 7 శాఖల్లో పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలపై సేకరించిన సర్వే ఫలితాలపై అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రజల సంతృప్తి అంశంలో క్షేత్ర స్థాయి వాస్తవ పరిస్థితుల ఆధారంగా ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలులో ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఐవీఆర్ఎస్‌తో పాటు వివిధ రూపాల్లో లబ్దిదారుల నుంచి నేరుగా సేకరించిన సమాచారం ఆధారంగా ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు. పింఛన్ల పంపిణీ, దీపం పథకం అమలు, అన్న క్యాంటీన్ నిర్వహణ, ఇసుక సరఫరా వంటి పథకాలు, పాలసీలపై వివిధ రూపాల్లో సమాచారం సేకరించారు. గ్రామస్థాయి వరకు సిబ్బంది, ఉద్యోగులు, అధికారులపై వచ్చిన ఫీడ్ బ్యాక్ పైనా అధికారుల నివేదిక తీసుకున్నారు.



## టూరిజంపై నిర్లక్ష్యం చేశారు

- అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి
- స్పీకర్ అయ్యన్న పాత్రుడు వెల్లడి



**విశాఖపట్నం,జనవరి27( వెలుతురు):**
ఎపిలో టూరిజానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని.. కానీ ఎందుకో ఎక్కువ అభివృద్ధి జరగలేదని ఎక్కడో లోపం ఉందని ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడుఅన్నారు. ఆర్కె బీచ్ నుంచి భీమిలి వరకు అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. సోమవారం నాడు వైజాగ్ రీజినల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో ఏపీ స్పీకర్ మాట్లాడుతూ.. విశాఖ బెస్ట్ సిటి అని అయినా ఎందుకో అనుకున్నంత అభివృద్ధి జరగలేదన్నారు. నర్సీపట్నం 14 కిలోమీటర్ల దూరంలో లంబసింగి ఉందని.. అక్కడ సరైన వసతి లేదన్నారు. బాత్రూంలు లేవని. టూరిస్టులు ఎలా వస్తారని ప్రశ్నించారు. రాత్రికి నర్సీపట్నంలో ఉండి.. ఉదయం లంబసింగి కి వెళ్ళవల్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని టూరిజం మంత్రిని కోరుతున్నామన్నారు. లంబసింగికి వచ్చిన వారు అల్లూరి స్మారక చిహ్నం దగ్గరకు వెళ్తారని తెలిపారు. లంబసింగి, అల్లూరి పార్క్ , బొజ్జన కొండని పర్యాక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. లంబసింగి నుంచి భద్రాచలం శ్రీరాముడు దేవాలయానికి వెళ్లే ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అరకు కాఫీ ఎంతో రుచిగా ఉంటుందని తెలిపారు. రాజమండ్రి ఎయిర్ పోర్ట్ నుంచి విజయనగరం కలెక్టర్ ఆఫీస్ వరకు నాలుగు లైన్ల రోడ్డు మంజూరు అయిందని.. ఈ మార్గమధ్యలో పర్యాటక అభివృద్ధి చేయాలని తెలిపారు. గాజువాకలో యారాడ బీచ్ చాలా అందమైన బీచ్ ఉందన్నారు. ఇన్వెస్ట్‌మెంట్స్ పెట్టడానికి వచ్చిన వారికి పర్మిషన్లు ఇవ్వడానికి ఎందుకు ఎక్కువ సమయం పడుతుందని ప్రశ్నించారు. అనుమతులు ఇవ్వడానికి వన్ ఇయర్ కావాలా అని స్పీకర్ అడిగారు. వన్ వీక్‌లో ఎస్ ఆర్ నో చెప్పాలని అప్పుడే టూరిజం అభివృద్ధి చెందుతుందని అభిప్రాపడ్డారు. టెంపుల్ టూరిజం డెవలప్ మెంట్ చేయాలన్నారు. నెగిటివ్ మైండ్ వదని పాజిటివ్ మైండ్‌తో విశాఖను అభివృద్ధి చేయాలని ఆయన అన్నారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు అందమైన బీచ్ ఉందని.. మధ్య మధ్యలో హాట్స్ వేసి పర్యాటకులను ఆకర్షించాలన్నారు. విశాఖ బీచ్‌కు ఎవరైనా టీ తాగడానికి వస్తారా అని ప్రశ్నించారు. గోవాకు ఎందుకు వెళ్తున్నారో అందరికీ తెలుసన్నారు. ‘మనకు కొన్ని రూల్స్ ఉన్నాయి.. బీచ్‌లకు వైన్ తాగడానికి కాకుండా.. టీ తాగడానికి పర్యాటకులు వస్తారా ? బీచ్ వాలీ బాల్, బీచ్ కబడ్డీ పెట్టండి.. స్పోర్ట్స్ లవర్స్ ఆస్వాదిస్తారు. ట్రైబల్ ఏరియాలో కొన్ని నిబంధనలు సవరిస్తే బాగుంటుందనుకుంటున్నాను. ట్రైబల్స్ ఏరియాలో ట్రైబల్స్ ఎక్కువగా పెట్టుబడులు పెట్టగలరా? నాన్ ట్రైబల్స్ పెట్టుబడులు పెడితే తమ పెట్టుబడికి భద్రత ఉండదు ఏమో భయపడుతున్నారు. దీనికి ఏమైనా రెమిడి ఉందా? అధికారులు స్టడి చేయలి. నేను స్పీకర్ గా మాట్లాడడం లేదు...ఒక పౌరుడిగా మాట్లాడుతున్నాను‘ అని ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు.

## రెడ్‌బుక్ నుంచి విజయసాయి తప్పించుకోలేరు

- చేసిన తప్పులకు శిక్షలు అనుభవించాల్సిందే
- టిడిపి నేతల ఘాటు వ్యాఖ్యలు



**విశాఖపట్నం,జనవరి27( వెలుతురు):**
రాజీనామా చేసినా, రెడ్‌బుక్ నుంచి తప్పించుకోలేరని మాజీ ఎంపీ విజయసారెడ్డికి టీడీపీ నేతలు స్ట్రాంగ్ వార్నింగ్ ఇస్తున్నారు. నారా లోకేష్ రెడ్‌బుక్‌లో వైసీపీ హయాంలో తప్పుచేసిన నేతలు, అధికారులను వదిలిపెట్టబోమని టీడీపీ నేతలు వార్నింగ్ ఇచ్చారు. తాజాగా విజయసారెడ్డిపై తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రెడ్ బుక్ ఇంకా ఓపెన్ చేయకుండానే విజయసారెడ్డి రాజీనామా చేశారని విమర్శించారు. రాజీనామా చేసినా విజయసాయిని వదిలిపెట్టబోమని.. రెడ్‌బుక్ పని ఆగదని పల్లా శ్రీనివాస్ హెచ్చరించారు. వైసీపీ హయాంలో అందరిని ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు పారిపోయేలా చేశారని ఆరోపించారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడి ఏపీకి అన్యాయం చేశారని విమర్శలు చేశారు. పబ్లిక్ సెక్టార్‌లను ముంచేయాలని జగన్ చూశారని పల్లా శ్రీనివాస్‌రావు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా చంద్రబాబు కృషి చేస్తున్నారని పల్లా శ్రీనివాస్‌రావు అన్నారు. చంద్రబాబు అంటే ఓ బ్రాండ్ అని ఉద్ఘాటించారు. దావోస్‌లో అగ్రిమెంట్లు అవ్వవు, అది చర్చా వేదిక అని చెప్పారు. రాష్ట్రాన్ని ప్రమోట్ చేయడానికి దావోస్ చాలా ఉపయోగపడుతుందని వివరించారు. పారిశ్రామికవేత్తలు పెట్టుబడి పెట్టేలా చంద్రబాబు కృషి చేశారని పల్లా శ్రీనివాస్‌రావు అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సీఎం ఎవ్వరికీ అందుబాటులో ఉండేవారు కాదని.. ఇప్పుడు సీఎం చంద్రబాబు పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉన్నారని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. దావోస్‌లో చంద్రబాబు పెద్దన్న పాత్ర పోషించారని ఉద్ఘాటించారు. సీఎం చంద్రబాబు రాష్ట్రానికే కాకుండా దేశం గురుంచి మాట్లాడటం సంతోషించదగ్గ విషయమని చెప్పారు. దావోస్ ఫలాలు తప్పనిసరిగా ఏపీకి అందుతాయని తెలిపారు. యువగళం ద్వారా మంత్రి నారా లోకేష్ ప్రజల్లోకి వెళ్లారని చెప్పారు. ప్రజా సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన తెచ్చుకున్నారని అన్నారు. మంగళగిరిలో ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు లోకేష్ మరింత చేరువయ్యారని చెప్పుకొచ్చారు. తాము కూడా లోకేష్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా దర్బార్ నిర్వహిస్తామని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. నాటి యువ గళం అడుగులే, నేడు ప్రజాగళంగా మారి ప్రత్యర్థుల గుండెల్లో పిడుగులై పడ్డాయని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ తెలిపారు. యువ నేత నారా లోకేష్ పాదయాత్ర వైసీపీ పాలిట దండయాత్రగా మారి 11 సీట్లకు పరిమితం చేశాయని విమర్శించారు. యువగళం పాదయాత్ర చేపట్టి రెండేళ్లు పూర్తి అయినా సందర్భంగా నారా లోకేష్‌కు ప్రణవ్ గోపాల్ శుభాకాంక్షలు తెలిపారు.

# కుంభమేళాలో ఆ రోజు ఎంతో పవిత్రం

## 29న మౌని అమావాస్య




**న్యూఢిల్లీ,జనవరి27( వెలుతురు):**
ఈసారి జరుగుతున్న మహాకుంభమేళా అత్యంత పవిత్రమైనది. 144 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే జరిగే అరుదైన ఖగోళ అమరిక ద్వారా వచ్చిన ఈ కుంభమేళా ఆధ్యాత్మికపరంగా ఎంతో విశిష్టమైనది. మహా కుంభమేళా సమయంలో అమృత స్నానానికి అత్యంత ప్రాముఖ్యతమైనది. కుంభమేళా పూర్తయ్యేలోగా 6 అమృత స్నానాలు ఉంటాయి. ప్రతి ఒక్కదానిని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ప్రత్యేకమైన రోజులలో రావడమే ఇందుకు కారణం. మకర సంక్రాంతి నాడు జరిగిన అమృత స్నాన్?తో సమానంగా మౌని అమావాస్య అమృత స్నాన్‌ను పరిగణిస్తారు. ఈ రోజున ఋషులు, సాధువులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. అందుకే ఈ అమృత స్నాన్ సమయంలోనే నాగ సాధువులకు దీక్ష కూడా ఇస్తారు. అదే మౌని అమావాస్య ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను మరింత పెంచుతుంది. మౌని అమావాస్య 2025 జనవరి 29న జరుపుకుంటారు. ఈ రోజునే మహాకుంభమేళాలో రెండవ అమృత స్నాన్ జరుగుతుంది. కుంభమేళా సమయంలో అమృత స్నానం ఆచరించడాన్ని అత్యంత పవిత్రమైనదిగా విశ్వసిస్తారు. మౌని అమావాస్య రోజుకు జరిగే అమృతస్నాన్‌కు మరింత ప్రాముఖ్యత ఉంది. అందువల్ల ఈ రోజున మహాకుంభ సమయంలో త్రివేణి సంగమంలోని పవిత్ర జలాలతో స్నానం చేయడాన్ని అమృతతుల్యంగా భావిస్తారు. హిందూ పురాణాలు ప్రకారం మౌని అమావాస్య నాడు అమృత స్నానం చేయడాన్ని అత్యంత పవిత్రమైనదిగా పరిగణిస్తారు. ఈ రోజున నాగ సాధువులు దండి కింద దీక్షను స్వీకరిస్తారు. మౌని అమావాస్య రోజున చంద్రుడిని పూజించడం వల్ల జాతకం బలపడుతుందని నమ్ముతారు. ఈ ప్రత్యేక సందర్భంలో పితృ పూజ చేసి పూర్వీకులను గౌరవిస్తే వారి ఆశీర్వాదాలు దక్కి కోరిన కోరికలు నెరవేరుతాయని విశ్వాసం. శివుని ఆరాధనకు, తాంత్రిక అభ్యాసాలు, మంత్ర సాధన, మంత్రాలను పఠించడానికి అత్యంత పవిత్రమైన రోజు ఇదే.

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు పోటెత్తుతున్నారు. గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 14 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. కుంభమేళా ప్రారంభైన జనవరి 13వ తేదీ నుంచి ఈనెల 26వ తేదీ వరకూ త్రివేణీ సంగమంలో 13.21 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు వెల్లడించింది. అందులో 10 లక్షల మంది కల్పవాసీలు కూడా ఉన్నట్లు పేర్కొంది. ఇక ఇవాళ ఉదయం 8 గంటల వరకూ దాదాపుగా 46.64 లక్షల మంది స్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపారు. సంక్రాంతి రోజున ప్రారంభమైన (జనవరి 13) మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేసింది యూపీ ప్రభుత్వం.

# ఢిల్లీలో వేడెక్కిన రాజకీయాలు

- రెండు మేనిఫెస్టోను విడుదల చేసిన ఆమ్‌ఆద్మీ పార్టీ

**ముంబై,జనవరి27( వెలుతురు):**
ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. అసెంబ్లీ ఎన్నికలకు మరో తొమ్మిది రోజులే సమయం ఉండటంతో అధికార, విపక్ష పార్టీల నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇక అధికార ఆమ్ ఆద్మీ పార్టీ రెండో మేనిఫెస్టోను విడుదల చేసింది. ఇప్పటికే మధ్యతరగతి ప్రజల కోసం ఆప్ మేనిఫెస్టో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా 15 గ్యారెంటీలతో ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సోమవారం కొత్త మేనిఫెస్టో రిలీజ్ చేశారు. వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో సంక్షేమ పథకాలు, ఉపాధి కల్పన, ప్రజాసేవల్లో మెరుగుదల వంటి 15 కీలక వాగ్దానాలు చేశారు. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలను కొనసాగిస్తామని వెల్లడించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థులకు ఉచిత బస్? సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. మెట్రో ఛార్జీల్లో 50శాతం రాయితీ ఇస్తామని హామీ ఇచ్చారు. 15 పోల్ గ్యారెంటీలు ఇవే.. ఉపాధి హామీ.. ప్రతి మహిళకు



రూ.2,100.. నేరుగా బ్యాంకు ఖాతాకే నగదు జమ. సంజీవని యోజన పథకం కింద 60 ఏళ్లు పైబడిన వారికి ఉచిత చికిత్స (ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య చికిత్స), 24 గంటల నీటి సరఫరా, యూరప్ తరహాలో రోడ్లు, యమునా నదిని శుభ్రం చేస్తాం, డాక్టర్ అంబేద్కర్ స్కాలర్‌షిప్ పథకం, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం, ఢిల్లీ మెట్రోలో 50 శాతం రాయితీ అర్చకులు, గ్రంథులకు ఒక్కొక్కరికి రూ.18వేలు, కౌలుదారులకు ఉచిత విద్యుత్, నీరు మురుగునీటి వ్యవస్థలను మెరుగుపరచటం, రేషన్ కార్డుల మంజూరు, ఆటో, టాక్సీ, ఇ-రిక్షా డ్రైవర్లకు జీవిత బీమా, వారి కుమార్తె వివాహానికి రూ. 1 లక్ష సాయం, పిల్లలకు ఉచిత కోచింగ్, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్‌కు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పథకాలు ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మధ్యతరగతి ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి అరవింద్ కేజ్రీవాల్ ఏడు డిమాండ్లు లేవనెత్తారు. ‘విద్యా బడ్జెట్‌ను రెండు నుంచి పది శాతానికి పెంచాలి, ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి. మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా ఉన్నత విద్యకు సబ్సిడీలు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి. ఆరోగ్య బడ్జెట్‌ను పది శాతానికి పెంచాలి, ఆరోగ్య బీమాపై పన్ను తొలగించాలి. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ. 7 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచాలి. నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తొలగించాలి. సీనియర్ సిటిజన్లకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలి. రైళ్లలో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీ ఇవ్వాలి’ అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ బడ్జెట్‌ను మధ్యతరగతి ప్రజలకు అంకితం చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# వైసిపి హయాంలో మంత్రులంతా డమ్మీ

- పార్లమెంటులో తనను అవమానించిన వైసిపి
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**గుంటూరు,జనవరి27( వెలుతురు):**
వైసీపీ హయాంలో మంత్రులకు ఎలాంటి అధికారం లేదని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. బీసీల ధైర్యాన్ని చూపించి పార్లమెంటులో తాను గట్టిగా నిలబడ్డానని తెలిపారు. తనను గతంలో పార్లమెంటులో అవమానించేలా వైసీపీ సభ్యులు మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రన్నాయుడు వారసుడిగా వచ్చిన తనను 3సార్లు ఎంపీగా గెలిపించారని గుర్తుచేశారు. వయసులో చిన్నవాడినైనా తనకు కేంద్రమంత్రిగా చంద్రబాబు అవకాశం కల్పించారని చెప్పారు. బీసీలంటే చంద్రబాబుకు ఎంత ప్రేమో చెప్పేందుకు తానే నిదర్శనమన్నారు. బీసీలంతా ఐకమత్యంతో పనిచేసి సమస్యల పరిష్కారం కోసం పని చేద్దామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
ఇవాళ(సోమవారం) గుంటూరు జిల్లాలో రామ్మోహన్ నాయుడు పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రామ్మోహన్ నాయుడు పాల్గొని మీడియాతో మాట్లాడారు. ఏపీలో బీసీల నాయకత్వానికి స్వర్గీయ ఎన్టీఆర్ పునాదులు వేశారని తెలిపారు. నేటి తరానికి ఈ విషయాలన్నీ తెలియజెప్పాల్సిన అవసరముందని అన్నారు. పంచాయతీ మెట్లు ఎక్కలేని బీసీలను పార్లమెంటు మెట్లు ఎక్కేలా తెలుగుదేశం పార్టీ అవకాశం ఇచ్చిందని అన్నారు. ఎన్టీఆర్ వేసిన పునాదులను పటిష్టం చేసేలా చంద్రబాబు పని చేస్తున్నారని అన్నారు. బీసీలకు ఏదైనా కొత్త పథకం



ప్రారంభమైందంటే అది కేవలం టీడీపీ హయాంలోనే అని తెలిపారు. చంద్రబాబు ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలతో బీసీలు బాగా చదువుకునే అవకాశం వచ్చిందని అన్నారు. బీసీ బిడ్డలు నేడు వైద్యులుగా, ఇంజనీర్లుగా దేశవిదేశాల్లో స్థిరపడేందుకు చంద్రబాబు కృషి చేశారని అన్నారు. సమాజంలో మార్పు రావాలంటే ఒక్కరితో సాధ్యం కాదు... అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రపంచాన్ని ఏలే తరంలో మన బీసీలు కూడా ఉండాలని అన్నారు. రాష్ట్రంలోని బీసీలంతా అండగా నిలిచారు కాబట్టే టీడీపీ అభ్యర్థులకు రికార్డు మెజార్టీలు దక్కాయని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.


## పీఎం సూర్యఘర్ ద్వారా 1లక్ష 10 వేల మందికి రుణాల

- రుణాల లక్ష్య సాదనకు బ్యాకర్లు కృషి చేయాలి..
- రుణాల మంజూరులో వెండర్లు, బ్యాంకర్లకు మధ్య సమన్వయం అవసరం..
- ఇంధన రంగంలో స్వయం సమృద్ధిలో బ్యాకర్ల భాగస్వామ్యం అవసరం..
- సమష్టి భాగస్వామ్యంతో సౌరశక్తి వినియోగంలో అగ్రగామిగా నిలుపుదాం..
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.

**విజయవాడ,జనవరి27( వెలుతురు):**
పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానెల్ కనెక్షలను ఏర్పాటు చేసేందుకు 1 లక్ష 10 వేల మంది లబ్దిదారులకు రుణాలను మంజూరు చేయాలన్న లక్ష్యాలను పూర్తి చేసేందుకు బ్యాకర్లు కృషి చేయాలని, రుణాల మంజూరులో వెండర్స్ బ్యాంకర్స్ మధ్య సమన్వయం అవసరమని, సమిష్టి కృషితో లక్ష్యాలను సాధించి ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించడంలో బ్యాకర్ల భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. సూర్యఘర్ పథకం కింద లబ్దిదారులకు రుణాలు మంజూరు పై సోమవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో 2 లక్షల ఇళ్ళకు సోలార్ విద్యుత్ ప్యానెల్‌ను అమర్చి జిల్లాను అగ్ర గామిగా నిలపాలనే లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందులో 1లక్ష 10 వేల మంది లబ్దిదారులకు బ్యాంకుల నుండి రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ధారించామన్నారు. ఇప్పటివరకు 787 మంది లబ్దిదారులు రుణాల కొరకు ధరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. 651 మంది లబ్దిదారులు 10 శాతం బాగస్వామ్యాన్ని చెల్లించడం జరిగిందన్నారు. లబ్దిదారులు ఇంటి కప్పుపై ప్రభుత్వ రాయితీతో పాటు అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకుని ప్రజలకు కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సూర్యఘర్ పథకం అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిపెట్టాయన్నారు. లబ్దిదారులు రూ. 2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్‌ను రూ. 78 వేల ప్రభుత్వ రాయితీతో ఇంటి కప్పుపై ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకోవలసి ఉంటుందన్నారు. ప్రభుత్వ రాయితీ మినహా మిగిలిన సొమ్మును బ్యాంకర్లు రుణంగా మంజూరు చేయవలసి ఉంటుందన్నారు. కేటాయించిన లక్ష్యాల సాదనలో వెండర్లకు బ్యాంకర్లకు మధ్య సమన్వయం అవసరమన్నారు. బ్యాంకర్లు కాలయాపన చేయకుండా స్వీకరించిన ధరఖాస్తులను పరిశీలించి తక్షణమే రుణాలను మంజూరు చేయాలన్నారు. లబ్దిదారులకు రుణాలు మంజూరు చేసిన నివేధికల వివరాలను ప్రతి రోజు సమర్పించాలని ఆయన అన్నారు.

పథకం ద్వారా జిల్లాలో రెండు లక్షల కనెక్షన్లను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ఇప్పటివరకు దాదాపు 65 వేల మంది లబ్దిదారులు ప్యానెల్‌ను పొందేందుకు పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. స్వయం సహాయక సంఘ మహిళలు కూడా పెద్దఎత్తున రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారన్నారు. సౌర శక్తి ద్వారా కాలుష్యం లేని పర్యావరణ హిత ఇంధనాన్ని పొందొవచ్చునని, ధరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు అవసరమైన రుణాలను తక్షణమే మంజూరు చేసి పథకం అమల్లో జిల్లాను అగ్రగామిగా నిలపడంలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో ఎల్‌డియం కె. ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, కెడిసిసి బ్యాంక్ ఎజియం వాసవి కుమారి, బ్యాంక్ ఆప్ బరోడ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, కెనర బ్యాంక్, ఇండియన్ ఒవర్ సీస్ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకుల అధికారులు, సెవెన్ రేస్ నెట్ మ్యాటరింగ్, విజేత సోలార్ మార్కెటింగ్ ఎజెన్సీ, సూర్య పవర్ ట్రీ, ఆల్ఫా సోలార్ ఇంజనీర్స్, ధక్షిణ్ సోలార్ పవర్, శ్రీ లక్ష్మీ మారుతి ఇంజనీరింగ్, తదితర సోలార్ ప్యానెల్ పంపిణీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ట్రంప్ సంతకంతో ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త ట్విస్ట్



హైదరాబాద్,జనవరి27( వెలుతురు):

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతకంతో ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు తిరగనుంది. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతోపాటు శ్రవణ్ రావులను అమెరికా ప్రభుత్వం డిపోర్ట్ చేయనుంది. అమెరికాలో వలసదారులు, క్రిమినల్ కేసులో నిందితులను ఆయా దేశాలకు అప్పగించాలని ట్రంప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాకు రిమైండర్స్ లెటర్లను హైదరాబాద్ పోలీసులు పంపనున్నారు. ఇప్పటికే ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులకు కోర్ట్ అరెస్ట్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. వీరిద్దరిని ఇండియాకు రప్పించేందుకు తాజా పరిస్థితిని అనుకూలంగా మార్చుకునేందుకు పోలీస్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీరిపై బ్లూ, రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. పాస్‌పోర్టు రద్దు, రెండు దేశాల మధ్య నేరస్తుల ఒప్పందం సంబంధించిన లేఖలను పోలీసులు మరోసారి పంపనున్నారు. ఇప్పటికే ఇద్దరిపై ఎల్ఓసీలు జారీ చేయడంతో ఇండియాలో అడుగుపెట్టగానే హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకోనున్నారు. ఫోన్ టాపింగ్ కేసులో ఏ1గా ప్రభాకరరావు, ఏ6 గా శ్రవణ్ రావు ఉన్నారు. ఈ కేసులో ఇప్పటికే టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధకిషన్ రావు, అడిషనల్ ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావు , డీఎస్పీ ప్రణీత్ రావులను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాగా.. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఒక కీలకమైన ఫైలుపై సంతకం చేశారు. అమెరికాలో తలదాచుకున్న ఇతర దేశాలకు చెందిన నేరస్తులు, క్రిమినల్ కేసులో నిందితులను ఆయా దేశాలను అప్పగించాలని ట్రాంప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని ఆ ఫైల్‌పై సంతకం కూడా చేశారు. దీంతో ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇండియా వదిలి అమెరికాలో ఉన్న ఏ1 నిందితుడు ప్రభాకర్‌రావు, ఏ6 నిందితుడు శ్రవణ్‌రావులను ఇండియాకు అప్పగించేందుకు అమెరికా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్ పోలీసులు చాలా సార్లు అమెరికా ప్రభుత్వానికి లేఖలు రాశారు. వారిద్దరినీ తమకు అప్పగించాలని రెడ్ కార్నర్ నోటీసును కూడా జారీ చేశారు. వారి పాస్‌పోర్టులను కూడా రద్దు చేయాలంటూ అమెరికా ప్రభుత్వానికి పలు మార్లు లేఖలు రాశారు హైదరాబాద్ పోలీసులు. ఈ క్రమంలో ట్రంప్ సంతకంతో వచ్చే వారం పదిరోజుల్లో ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు ఇండియా అప్పగిస్తే ఈ కేసులో కీలక అంశాలు బయటపడే అవకాశం ఉంది. ఇరు దేశాల మధ్య నేరస్తుల ఒప్పందం చట్టం ప్రకారం మరోసారి అమెరికా ప్రభుత్వానికి హైదరాబాద్ పోలీసులు లేఖ రాసే అవకాశం ఉంది. ప్రభాకర్ రావు, శ్రవణ్‌రావులకు నాంపల్లి కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ అంశాలపై పూర్తిస్థాయిలో అమెరికా ప్రభుత్వానికి హైదరాబాద్ పోలీసులు లేఖ రాసే అవకాశం ఉంది.

# బీజేపీ ఎమ్మెల్యే, స్వతంత్ర ఎమ్మెల్యే మధ్య రాజుకుంటున్న విభేదాలు

- ఒకరి కార్యాలయంపై మరొకరు దాడి

డెహ్రాడూన్,జనవరి27( వెలుతురు):

బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే, స్వతంత్ర ఎమ్మెల్యే మధ్య నెలకొన్న విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో ఒకరి కార్యాలయంపై మరొకరు రాళ్లు రువ్వడంతోపాటు కాల్పులు జరుపుకున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లోని రూర్కీలో ఈ సంఘటన జరిగింది. బీజేపీ మాజీ ఎమ్మెల్యే కున్వర్ ప్రణవ్ సింగ్ ఛాంపియన్ ఆదివారం తుపాకులు చేతపట్టి తన అనుచరులతో కలిసి ఖాన్‌పూర్ స్వతంత్ర ఎమ్మెల్యే ఉమేష్ కుమార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కున్వర్, ఆయన అనుచరులు అక్కడ హంగామా చేశారు. ఎమ్మెల్యే ఉమేష్ కుమార్ కార్యాలయంపై కాల్పులు జరుపడంతోపాటు రాళ్లు రువ్వి దుర్భాషలాడారు. కాగా, ఎమ్మెల్యే ఉమేష్ కుమార్ కూడా ధీటుగా స్పందించారు. తన అనుచరులతో కలిసి కున్వర్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ రాళ్లు రువ్వడంతోపాటు పిస్టల్‌తో కాల్పులు జరిపి దూషించారు. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పరస్పరం ఫిర్యాదులు చేసుకున్న మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యేను అరెస్ట్ చేశారు. మరోవైపు ఎమ్మెల్యే ఉమేష్ కుమార్ శనివారం రాత్రి లంధౌరాలోని తన భవనంపై దాడి చేశాడని, తనను దుర్భాషలాడినట్లు బీజేపీ మాజీ ఎమ్మెల్యే కున్వర్ ప్రణవ్ సింగ్ ఛాంపియన్ ఆరోపించారు. దీనిపై స్పందించిన తనను పోలీసులు అరెస్ట్ చేశారని, ఇది అన్యాయమని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా తాను పోరాడతానని అన్నారు. కాగా, బీజేపీ మాజీ ఎమ్మెల్యే కున్వర్ ప్రణవ్ సింగ్ ఛాంపియన్, ఇండిపెండెంట్ ఎమ్మెల్యే ఉమేష్ కుమార్ మధ్య చాలా కాలంగా విరోధం నెలకొన్నది. దీంతో ఒకరిపై మరొకరు ఆరోపించుకోవడంతోపాటు సోషల్ మీడియాలో విమర్శించుకోవడం ఈ ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో వారిద్దరి వద్ద ఉన్న పిస్టల్స్ లైసెన్స్ రద్దు కోసం జిల్లా మేజిస్ట్రేట్‌కు సిఫార్సు చేస్తామని పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. మరోవైపు వీరి మధ్య ఘర్షణకు సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# 78 స్వాతంత్ర్య భారతంలో ఇంకా కనీస వసతులు కరువు

- మారుమూల గ్రామాల్లో తాగునీటికి అవస్థలు

న్యూఢిల్లీ, జనవరి27( వెలుతురు):

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి సుమారుగా 78 ఏళ్లు పూర్తయ్యింది. ఈ ఎనిమిది దశాబ్దాల్లో దేశంలో ఎంతో అభివృద్ధి జరిగింది. దాదాపు అన్ని రంగాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. అయితే వివిధ రాష్ట్రాల్లోని కొన్ని మారుమూల గ్రామాలకు మాత్రం ఇంకా అన్ని రకాల అభివృద్ధి ఫలాలు అందలేదు. ఇప్పటికీ సరైన రవాణా సౌకర్యం, తాగునీటి వసతి లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన చిల్కపల్లి గ్రామం కూడా ఆ కోవకు చెందినదే. చిల్కపల్లి గ్రామానికి రవాణా, తాగునీటి సంగతి దేవుడెరుగు.. ఇప్పటిదాకా కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఆ గ్రామం విద్యుత్ వెలుగులకు నోచుకున్నది. బీజాపూర్ జిల్లా కలెక్టర్ సంబిట్ మిశ్రా ఈ నెల 23న చిల్కపల్లి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. దాంతో చిల్కపల్లి గ్రామ ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. చాన్నాళ్ల తర్వాత తమ ఇళ్లలో విద్యుత్ వెలుగులను చూసుకుని సరికొత్త అనుభూతి చెందుతున్నారు. జనవరి 23 నుంచి చిల్కపల్లి గ్రామానికి విద్యుత్ వెలుగులు మొదలయ్యాయని సంబిట్ మిశ్రా చెప్పారు. నియాద్ నెల్నార్ పథకం కింద ఆ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ పథకం కింద విద్యుత్ సౌకర్యం పొందిన ఆరో గ్రామం చిల్కపల్లి అని మిశ్రా వెల్లడించారు.

# సుప్రీంకోర్టులో జగన్‌కు ఊరట

- బెయిల్ రద్దు పటిషన్ తిరస్కరించిన ధర్మాసనం
- కేసును బదిలీ చేయాల్సిన అవసర లేదని వ్యాఖ్య
- సుప్రీం తీర్పుతో రఘురామ పిటిషన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ,జనవరి27( వెలుతురు):

సుప్రీం కోర్టులో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి భారీ ఊరట లభించింది.. వైఎస్ జగన్ బెయిల్‌ను రద్దు చేయాలంటూ.. మరోవైపు జగన్ పై ఉన్న కేసులను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు గతంలో వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది.. రఘురామ కృష్ణంరాజు పిటిషన్ పై జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మల ధర్మాసనం విచారణ జరిపింది.. చివరకు ఆ పిటిషన్‌ను డిస్మస్ చేస్తున్నట్టు వెల్లడించింది.. ఇక, జగన్ బెయిల్ ను రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్ ను ఉపసనీహరించుకున్నారు పిటిషనర్.. ఈ పరిణామాలతో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించినట్టు అయ్యింది..అయితే కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. జగన్‌ను కేసులను రోజు వారీ విచారణ చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. జగన్ కేసుల బదిలీకి నిరాకరించిన సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టులో జగన్ అక్రమాస్తుల కేసు పర్యవేక్షణ నేపథ్యంలో వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే జగన్ బెయిల్‌ను రద్దు చేయాలన్న పిటిషన్‌పై కూడా ప్రత్యేకంగా విచారణ అవసరం లేదని చెప్పింది. గతంలో సుప్రీంకోర్టు ఎమ్మెల్యే, ఎంపీల కేసుల విషయంలో ఇచ్చిన తీర్పు ఈ కేసుకు కూడా వర్తిస్తుందని సుప్రీం ధర్మాసనం తేల్చిచెప్పింది. ట్రయల్ కోర్టు... రోజు వారీ విచారణకు తీసుకోవాలని, హైకోర్టు కూడా పర్యవేక్షణ చేయాలని అందువల్ల మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర మిశ్రా ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామని రఘురామ తరఫు న్యాయవాది బాలాజీ సుబ్రహ్మణ్యం కోర్టుకు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ బెయిల్ రద్దు, కేసుల ట్రయల్ విచారణ ధర్మాసనం మార్పు చేయాలని రఘురామకృష్ణరాజు సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ వేశారు. గతంలో ఈ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం విచారించగా.. ఆ తర్వాత జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనం ముందుకు వెళ్లింది. గత 12 ఏళ్లుగా ట్రయల్ ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదని.. ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్ కూడా డిస్పోజ్ చేయలేదని రఘురామ తరఫు న్యాయవాది బాలాజీ సుబ్రహ్మణ్యం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బదిలీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు గత విచారణలోనే చెప్పిందని.. తాము ఇప్పుడు కేసు మానిటరింగ్ పూర్తి స్థాయిలో జరగాలని కోరుతున్నామని తెలిపారు. అయితే.. సీబీఐ కేసుల వివరాలు, ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ సీబీఐ అఫిడవిట్ దాఖలు చేసిందని దర్యాప్తు సంస్థ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. మరోవైపు.. ఈ కేసును హైకోర్టు మానిటర్ చేస్తోందని.. ఇంకా కేసు అక్కడ పెండింగ్‌లో ఉందని జగన్ తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు. అన్నివైపులా వాదనలు విన్న ద్విసభ్య ధర్మాసనం.. చివరకు రఘురామ పిటిషన్‌ను డిస్మస్ చేస్తూ ద్విసభ్య ధర్మాసనం ఇవాళ తీర్పు ఇచ్చింది.




# కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తిరుగుబాటు

- గ్రామసభల్లో నిలదీసినా కప్పిపుచ్చుకునే యత్నం
- హామీల అమలుకు ఏడాదైనా పూర్తి చేయని వైనం
- మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు

నిజామాబాద్,జనవరి27( వెలుతురు):

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై గ్రామసభల సాక్షిగా కాంగ్రెస్ సర్కారును ప్రజలు అనేకచోట్ల నిలదీసారని, ప్రజలకు సమాధానం చెప్పే స్థితిలో పాలకులు లేరని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డుల సర్కస్ ఫీట్లు, లోకల్ బాడీ ఓట్ల కోసం కాంగ్రెస్ పడుతున్న పాట్లు అని ఎద్దేవా చేశారు. కేవలం స్థానిక ఎన్నికల్లో పట్టుకోసం చేస్తున్న కసరత్తు తప్ప ప్రజల మేలుకోరి చేసే పనులు మాత్రం కావన్నారు. అమలు కాని ఆరు గ్యారంటీలే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది అని పేర్కొన్నారు. గ్రామసభల్లో ప్రజలు తిరగబడు తున్నారని తెలిసి కూడా బుకాయించారని అన్నారు. ఏడాది దాటినా ఆరు గ్యారంటీలకే గతి లేదని, ఇక ఇండ్లు, రేషన్ కార్డు ఇస్తామంటే నమ్మేదెవరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల మంజూరు పేరుతో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజల తిరుగుబాటు కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు నిలువెత్తు నిదర్శనమని వేముల పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలకే ఉప్పు పాతరేసి కొత్తగా ఈ డ్రామాలేమిటని ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. అక్కడక్కడ హామీల అమలుపై ఎమ్మెల్యేలను ప్రజలు నిలబెట్టి అడిగారని అన్నారు. ఇండ్లు ఎప్పుడు కట్టిస్తారంటూ



మహిళలు తిరగబడ్డారని గుర్తుచేశారు. అబద్దాలు చెబుతూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలవాలని మోసాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ జీరో కాక తప్పదన్నారు. గ్రామసభల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే లేరని, మంత్రులు పత్తా లేకుండా పోయారని, ఎమ్మెల్యేలను గ్రామాలకు రానివ్వడం లేదన్నారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగలేరన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై ప్రజలు తిరగబడ్డా రని వేముల అన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు పుట్టి పెరిగిన గ్రామాల్లో ఎన్నికల హామీలు నూరు శాతం అమలు జరిగాయని నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, లేకుంటే కాంగ్రెస్ నేతలు రాజకీయాల నుం చి తప్పుకుంటారా అని సవాల్ విసిరారు. హామీల అమలులో ప్రజలకు సర్కారు వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలను మండలానికి ఒక గ్రామం చొప్పున, జిల్లాలోని 35 మండలాల్లో కేవలం 35 గ్రామాల్లో ప్రారంభించారని తెలిపారు. ఏ ఊరికైనా వెళ్లి, నూరుశాతం హామీలు అమలవుతున్నాయని ప్రజలు చెబితే రాజకీయాలను వదిలేస్తానని, లేకుంటే కాంగ్రెస్ నాయకులు, రాజకీయాలు వదిలేసి ముక్కు నేలకు రాస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలవి తుగ్లక్ రాజకీయాలని ఆయ న విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల వీరంగాలు, అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడే రకం కాదన్నారు. తాము పోరాడుతూనే ఉంటామని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రజలను మోసగిస్తున్నదని, అందుకే ఎక్కడ చూసినా జనాగ్రహజ్వాలలే కనిపిస్తున్నాయన్నారు. ఇది ప్రజాపాలన కాదని, తుగ్లక్ పాలన అని విమర్శించారు. ఎన్నికల హామీల అమలులో ఘోర వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికే రోజుకో నాటకం వేస్తున్నారని మండిపడ్డారు. పథకాల అమలుకు సంక్రాంతి పోయిందని, ఇప్పుడు శివరాత్రికి అంటున్నారని ఎద్దేవా చేశారు.

# రాజకీయంగా వైరుధ్యంతో పార్టీలో అసంతృప్తి

- జాడ లేని మార్కెట్ కమిటీల నియామకం

జగిత్యాల,జనవరి27( వెలుతురు):

నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో పనులు సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనికితోడు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి. ఎమ్మెల్యే సంజయ్‌కు పొసగకపోవడంతో పార్టీలో ఏకాభిప్రయం కానరావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఏడాది గడిచినా జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టు భర్తీకాకపోవడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఇష్టారాజ్యంగా పాలన సాగుతుండడంతో అటు ప్రజలు, ఇటు అధికారులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు.జగిత్యాల నియోజకవర్గ పరిధిలో రెండు మార్కెట్ కమిటీలు ఉండగా, రెండింటికి పాలకవర్గాలను ఇంత వరకు నియమించలేదు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడంతో రాజకీయాలన్నీ తారుమారు అయిపోయాయి. ఎమ్మెల్సీగా కొనసాగుతున్న జీవన్‌రెడ్డి జగిత్యాల, రాయికల్ మార్కెట్ కమిటీ చైర్మన్లతో పాటు, పాలకవర్గానికి కొందరు కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల పేర్లను ఏడాది క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మరికొందరి పేర్లను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీంతో చిక్కుల్లో పడ్డ అధికారులు ఎవరినీ ఎంపిక చేయకుండా వదిలిపెట్టారు. వడ్ల కొనుగోలుకు సంబంధించి రెండు సీజన్లు పూర్తయి, మూడో సీజన్ ప్రారంభమైనా ఇంకా కమిటీల ఏర్పాటు జరగకపోవడంపై రైతులు, కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంపిక విషయంలోనూ తీవ్రమైన జాప్యం నెలకొన్నది. జిల్లాస్థాయి పోస్టు కావడంతో మూడు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పదవిని ఆశిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ధర్మపురి నియోజకవర్గానికి చెందిన బ్రాహ్మణ కమ్యూనిటీకి చెందిన ఒక సీనియర్ నాయకుడికి చైర్మన్ పోస్టు కట్టబెట్టాలని ప్రభుత్వ విప్ ప్రయత్నించారు. అలాగే, కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు సైతం అదే పదవిని ఆశిస్తూ వచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని దళిత వర్గానికి చెందిన సీనియర్ కార్యకర్తకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అయితే, సదరు దళిత నాయకుడికి పదవి ఇవ్వడం ఇష్టంలేని ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతున్న మరో నాయకుడి పేరును ప్రతిపాదిస్తూ సిఫారస్ చేశారు. దీంతో చైర్మన్ ఎంపికలోనూ ప్రతిష్టంభన ఏర్పడింది. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి భర్తీ విషయంలో చక్రం తిప్పిన జగిత్యాల ఎమ్మెల్యే తన రాజకీయ ప్రత్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిర్ణయాన్ని విజయవంతంగా అడ్డుకున్నట్లు తెలుస్తోంది. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జితో ఉన్న బంధుత్వాన్ని ఆసరాగా చేసుకొని, చొప్పదండి ఎమ్మెల్యే, ధర్మపురి ఎమ్మెల్యేను ఒప్పించి, ఎమ్మెల్యే ప్రతిపాదించిన దళిత వర్గానికి చెందిన నాయకుడికి కాకుండా, తన సామాజిక వర్గమైన కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడి పేరును ప్రతిపాదించినట్లుగా సమాచారం.




## ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి..

న్యూఢిల్లీ,జనవరి27( వెలుతురు):

బీజేపీ పాలిత రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి అమల్లోకి వచ్చింది. దీంతో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత యూసీసీ ని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించింది. ఈ సందర్భంగా ప్రతి ఏటా జనవరి 27ని ఉత్తరాఖండ్‌లో యూసీసీ డేగా జరుపుకోనున్నట్లు సీఎం ప్రకటించారు. గతేడాది ఫిబ్రవరి 7న యూసీసీ బిల్లుకు ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఆమోదం పొందింది. 2024, మార్చి 11 ఆ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఓకే చెప్పిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మార్చి 12న నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి పౌర స్మృతి 2024 చట్టాన్ని ఈ ఏడాది జనవరిలో పూర్తిగా అమలు చేయనున్నట్లు అందులో పేర్కొన్నారు. దీని అమలు కోసం ప్రత్యేక పోర్టల్, మొబైల్ యాప్ ఏర్పాటు చేశారు. మహిళలు, పిల్లల సాధికారతే లక్ష్యంగా యూసీసీ అమలు ఉంటుందని సీఎం ధామి గతంలో తెలిపారు. కాగా, పోర్చుగీస్ పాలనలో ఉన్నప్పటి నుంచి గోవాలో ఉమ్మడి పౌరస్మృతి అమల్లో ఉంది.



# ఓటీటీలోకి 'పుష్ప 2'




గతేడాది డిసెంబర్ 05న థియేటర్లలో విడుదలైన 'పుష్ప 2' సినిమా ఇండియన్ సినిమా ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసేసింది. మొదటి రోజు నుంచే బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకున్న ఈ మూవీ ఇప్పటివరకు రూ. 1890 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. తద్వారా దంగల్ తర్వాత అత్యధిక కలెక్షన్లు రాబట్టిన భారతీయ సినిమాగా రికార్డుల కెక్కింది. ఇటీవలే రిలీజ్ చేసిన పుష్ప 2 రీలోడెడ్ వెర్షన్ కు కూడా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. కొత్త సీన్లను చూడడానికే ఆడియెన్స్ థియేటర్లకు పరుగులు తీస్తున్నారు. దీంతో చాలా చోట్ల ఇప్పటికీ పుష్ప 2 థియేటర్లు ప్రేక్షకులతో కళకళలాడుతున్నాయి. ఇదిలా ఉంటే పుష్ప 2 సినిమా థియేటర్లలో రిలీజై దాదాపు రెండు నెలలు కావస్తోంది. దీంతో ఈ బ్లాక్ బస్టర్ మూవీని ఎప్పుడెప్పుడు ఓటీటీలో చూద్దామా? అని చాలామంది వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పుడీ నిరీక్షణకు తెర పడనుంది. మరో మూడు రోజుల్లో అల్లు అర్జున్ సినిమా ఓటీటీలోకి రానుంది. పుష్ప 2 సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ఓటీటీ దిగ్గజం నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. థియేటర్లలో విడుదల అయిన 56 రోజుల తర్వాతే డిజిటల్ స్ట్రీమింగ్ అవుతుందని ఇదివరకే ప్రకటించారు. ఇందుకు తగ్గట్టుగానే 'పుష్ప2: ది రూల్' ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. అభిమానులను సర్‌ప్రైజ్ చేస్తూ రీలోడెడ్ వెర్షన్‌ను డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు వచ్చేస్తుంది. జనవరి 30 నుంచి నెట్‌ఫ్లిక్స్ లో పుష్ప 2 స్ట్రీమింగ్ కు రానుంది. ఈ మేరకు పుష్ప 2 రీలోడెడ్ వర్షన్ గురువారం రిలీజ్ కానున్నట్లు నెట్ ఫ్లిక్స్ యాప్‌లో చూపిస్తోంది. కాగా డిసెంబరు 5న 3 గంటలా 20 నిమిషాల నిడివితో విడుదలైన 'పుష్ప2'కు అదనంగా మరో 20 నిమిషాల సన్నివేశాలను జత చేశారు. దీంతో సినిమా నిడివి దాదాపు 3 గంటల 40 నిమిషాలకు పెరిగింది. ఇప్పుడు ఓటీటీ వెర్షన్‌ను కూడా ఇదే రన్ టైమ్ తో స్ట్రీమింగ్ చేయనున్నారు. తెలుగు తో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో నూ పుష్ప 2 స్ట్రీమింగ్ కానుంది.

## అందంతో కట్టిపడేస్తున్న ఈషారెబ్బ

నెట్టింట్లో ఎప్పుడూ తన గ్లామర్ ఫొటోలతో రచ్చ చేసే ముద్దుగుమ్మల్లో ముందు వరసలో ఉంటుంది బ్యూటీ ఈషా రెబ్బ. ఈ బ్యూటీ అంతక ముందు తర్వాత అనే సినిమాతో తెలుగ చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టింది. అయితే ఈ బ్యూటీకి అవకాశాలు మాత్రం తక్కువే అని చెప్పాలి. అందం, అభినయం ఎంత ఉన్నా, అవకాశాల్లో మాత్రం చివరి ప్లేస్‌లో ఉంటుంది. ఈ అందాల తార. ఎప్పుడూ మంచి అవకాశాల కోసం పోరాటం చేస్తూనే ఉంటుంది. ఇక ఈ బ్యూటీ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన గ్లామర్‌తో కుర్రకారుకు పిచ్చెక్కిస్తుంటుంది. తాజాగా ఈముద్దుగుమ్మ ఇన్ స్టాగ్రామ్‌లో చీరకట్టులో ఉన్న ఫొటోలను షేర్ చేసింది. ఇందులో ఈషా స్లీవ్ లెస్ జాకెట్ ధరించి, చీరలో చాలా అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెటిజన్స్‌ను తెగ ఆకట్టుకుంటున్నాయి.



## ట్రైలర్ రిలీజ్‌కు తండేల్ రెడీ




టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య – సాయిపల్లవి కాంబోలో వస్తోన్న రొమాంటిక్ డ్రామా ప్రాజెక్ట్ తండేల్. చందూ మొండేటి డైరెక్ట్ చేస్తోన్న ఈ మూవీ ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ప్రమోషన్స్‌లో భాగంగా ఒక్కొక్క పాటలను విడుదల చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నారు. ఇక మూవీ లవర్స్, అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తండేల్ ట్రైలర్ అప్‌డేట్ అందించారు మేకర్స్. తండేల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను వైజాగ్ శ్రీరామ పిక్చర్ ప్యాలెస్ (రామ టాకీస్ రోడ్) వద్ద నిర్వహించనున్నారు. జనవరి 28 సాయంత్రం 5 గంటల నుంచి ఈవెంట్ ఉండబోతుందని తెలియజేశారు మేకర్స్. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న తండేల్ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య–చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

## హరిహరివీరమల్లులో బాబీ డియోల్ ఫస్ట్‌లుక్ రిలీజ్

నటుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ హరిహర వీరమల్లు. పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా రెండు పార్ట్‌లుగా రాబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఫస్ట్ పార్ట్ శరవేగంగా షూటింగ్ కంప్లీట్ చేసుకుంటుంది. మరోవైపు ఈ సినిమాను 2025 మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఇక విడుదల తేదీ దగ్గర పడడంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. ఇప్పటికే మూవీ నుంచి పవన్ కళ్యాణ్ పాడిన ఫస్ట్ సింగిల్ 'మాట వినాలి' అనే పాటను వదిలిన చిత్రబృందం తాజాగా విలన్ అప్‌డేట్ ఇచ్చింది. ఈ సినిమాలో విలన్ పాత్రలో నటిస్తున్న బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ బర్త్‌డే నేడు. ఈ సందర్భంగా మూవీ నుంచి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. బాబీ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. జ్యోతి కృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం మొదటి పార్ట్ 'హరిహర వీరమల్లు పార్ట్: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల రాబోతున్నది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.




## పెళ్లి తరువాత కూడా గ్లామర్‌తో రెచ్చగొడుతున్న

# శోభిత

అక్కినేని నాగచైతన్య సమంత డివోర్స్ తర్వాత, శోభితా దూళిపాళ్ల తెరపైకి వచ్చింది. వీరి విడాకుల అనంతరం ఈ బ్యూటీ పేరు సోషల్ మీడియాలో ఎప్పుడూ వైరల్ అవుతూనే వచ్చింది. చైతూ, శోభితా ప్రేమలో ఉన్నారంటూ అనేక వార్తలు వచ్చాయి. ఇక వీటన్నింటి మధ్య ఆ వార్తలనే నిజం చేస్తూ నాగచైతన్య, శోభితను రెండో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే అక్కినేని కోడలిగా మారిన తర్వాత శోభిత అందం విషయంలో చాలా కేర్ తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. అంతే కాకుండా తన గ్లామర్ ఫొటోలతో నెట్టింట్లో తెగ రచ్చ చేస్తోంది. దీంతో ఏంటీ శోభితా సమంతను బీట్ చేయాలని చూస్తుందా ఏంటీ... నాగచైతన్యకు భార్య అయిన తర్వాత గ్లామర్ తో అందాల ట్రీట్ ఇస్తుంది అంటున్నారు కొందరు. మరికొందరేమో, సమంత గ్లామర్ ఫొటోలు షేర్ చేస్తే తప్పు పట్టారు, మరి ఇప్పుడు శోభితా చేసేది కరెక్ట్‌నే అక్కినేని కోడలు అయిన తర్వాత హద్దులు దాటి మరి గ్లామర్ అరాచకం సృష్టిస్తుంది. ఇదేంటి అంటూ ప్రశ్నిస్తున్నారు.



## వారి ప్రవర్తన బాగాలేదు

### - మంచులక్ష్మి



టాలీవుడ్ ప్రముఖ నటి మంచు లక్ష్మి ఇండిగో విమానాయాన సంస్థ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇండిగో సిబ్బంది చాలా దురుసుగా ప్రవర్తించారని మండిపడింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా వరుసగా పోస్టులు పెట్టిందామె. అంతేకాదు తన పోస్టులకు ఇండిగో సంస్థను కూడా ట్యాగ్ చేసింది.' నా లగేజ్ బ్యాగేజ్‌ను పక్కకు తోసేశారు. కనీసం నేను నా బ్యాగ్ ఓపెన్ చేసేందుకు కూడా పర్మిషన్ ఇవ్వలేదు. వాళ్లు చెప్పింది వినకపోతే నా బ్యాగును గోవాలోనే వదిలేస్తామన్నారు. ఇది చాలా దారుణం. ఇండిగో సిబ్బంది చాలా దురుసుగా ప్రవర్తించారు. ఇంకా పచ్చి నిజం మాట్లాడుకోవాలంటేవేధించారు. చివరకు నా లగేజీకి సెక్యూరిటీ ట్యాగ్ కూడా వేయలేదు. ఒకవేళ అందులో ఏదైనా వస్తువు మిస్ అయితే సంస్థ బాధ్యత తీసుకుంటుందా? ఇంత నిర్లక్ష్యంగా ఎయిర్‌లైన్స్‌ను ఎలా నడపగలుగుతున్నారు? అని వరుస ట్వీట్స్ చేసింది మంచు లక్ష్మి. అంతేకాదు తన బ్యాగుకు కనీసం లాక్ వేయలేదు, ట్యాగ్ కూడా వేయలేదని వీడియోలు సైతం అందులో షేర్ చేసింది. ప్రస్తుతం మంచు లక్ష్మి షేర్ చేసిన పోస్టులు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరలవుతున్నాయి. మరి వీటిపై ఇండిగో విమానయాన సంస్థ ఎలా స్పందిస్తుందో చూడాలి.


## కన్నప్పలో ప్రభాస్ కీలక పాత్ర



ప్రభాస్‌ని స్క్రీన్‌పై ఎన్ని అవతారాల్లో చూసిన చాలు అనిపించడం లేదు. అందుకేనేమో రెబల్ ఫ్యాన్స్ 'కన్నప్ప'లో ప్రభాస్ లుక్ కోసం చాలా ఎగ్జైట్ అవుతున్నారు. ఈ బజ్ ని దృష్టిలో పెట్టుకొనే మంచు విష్ణు మెగా ప్లాన్ వేశాడు. ఇప్పటి వరకు సినిమాలోని కీలక పాత్రల లుక్స్ అని రిలీజ్ చేసిన విష్ణు.. ప్రభాస్ లుక్ మాత్రం కాస్త ఆలస్యం చేశాడు. గత సోమవారం శివుడి పాత్రలో అక్షయ్ లుక్ రిలీజ్ చేయగా, కేవలం ప్రభాస్ లుక్ మాత్రమే బాకీ ఉంది. మరోవైపు ఈ సినిమా రిలీజ్ ఏప్రిల్ మాసంలో ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రభాస్ లుక్ ని మహాశివరాత్రికి రిలీజ్ చేస్తారేమో అంతా భావించారు. కానీ విష్ణు సూపర్ ట్విస్ట్ ఇచ్చాడు. ఈ సినిమా టీజర్ రిలీజ్ అయినప్పుడు ప్రభాస్ ఫ్యాన్స్ కాస్త నిరాశ చెందారు. ఎందుకంటే అందరి పాత్రలు ఎంతో కొంత కనిపించిన ప్రభాస్ నామాల దర్శనంతోనే ఫ్యాన్స్ కి సరిపెట్టేశాడు విష్ణు. విష్ణుకు కావాల్సింది కూడా అదే. ఎందుకంటే దీంతో ప్రభాస్ ని చూడటానికి అందరిలో స్పెషల్ బజ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే విష్ణు తన సోమవారాల సెంటి మెంట్ తో వచ్చే సోమవారం(ఫిబ్రవరి 3)న ప్రభాస్ పోస్టర్ రిలీజ్ చేస్తామని ప్రకటించాడు. ప్రస్తుతానికి ఒక హాఫ్ పోస్టర్ ని రిలీజ్ చేశాడు. చాలామంది ఎక్స్‌పెక్ట్ చేసిన దానికంటే ప్రభాస్ విభిన్నంగా కనిపించడంతో ప్రశంసలు వినిపిస్తున్నాయి. ఇది ఇలా ఉండగా ఇప్పటికే ఇంటర్నెట్ లో ప్రభాస్ లుక్ లీక్ అయ్యింది. దీన్ని విష్ణు ఎలా కవర్ చేస్తాడో తెలియాలి అంటే ఫిబ్రవరి 3 వరకు వెయిట్ చేయాల్సిందే.

# మహారాష్ట్రలో గిలైన్ బారె సింద్రోమ్ కలకలం

- కలుషిత ఆహారం, నీటి ద్వారా ఆ బ్యాక్టీరియా వ్యాప్తి
- సోలాపూర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మరణం




**ముంబయి,జనవరి27( వెలుతురు):**
మహారాష్ట్రలో గిలైన్ బారె సింద్రోమ్ కలకలం సృష్టిస్తోంది. తాజాగా సోలాపూర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మరణించగా.. అందుకు జీబీఎస్ కారణమని అనుమానిస్తున్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఆ బ్యాక్టీరియా సోకుతుంది. దాని బారిన పడిన వ్యక్తుల్లో డయేరియా, పొత్తికడుపు నొప్పి, జ్వరం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆ ఇన్ఫెక్షన్‌కు రోగనిరోధక వ్యవస్థ ప్రతిస్పందించే క్రమంలోనే జరిగే పొరపాటే కొందరిలో జీబీఎస్‌కు దారితీస్తుంది. ప్రతీ వెయ్యి మందిలో ఒకరికే ఈ పరిస్థితి ఎదురవుతుంది.పుణెలో ఇప్పటివరకు నమోదైన జీబీఎస్ కేసుల సంఖ్య 101కి చేరుకుంది. వారిలో 16 మంది వెంటిలేటర్ మీద చికిత్స పొందుతున్నారు. మృతిచెందిన వ్యక్తి కూడా పుణెలోనే చికిత్స పొందాడు. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా బలహీన రోగనిరోధక శక్తి కలిగిఉన్న వ్యక్తులు ఈ జీబీఎస్ బారినపడే అవకాశాలు ఉంటాయని వైద్యులు వెల్లడించారు. శరీరానికి సోకిన ఇన్ఫెక్షన్‌కు ప్రతిస్పందించే రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున నరాలపై దాడి చేసే అరుదైన పరిస్థితి ఇది. ఆ రుగ్మత బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. డయేరియాకు కారణమయ్యే కాంపిలోబ్యాక్టర్ జెజునీ బ్యాక్టీరియా జీబీఎస్‌కు కారణం కావొచ్చని వైద్యులు అనుమానిస్తున్నారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని, జీబీఎస్ అంటువ్యాధి కాదని, చికిత్సతో నయం చేయొచ్చని వైద్యులు వెల్లడించారు. బాధితుల్లో 80 శాతం మంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత ఆరు నెలల్లో స్వతహాగా నడవగలరు. మరికొంతమందికి మాత్రం ఆ సమయం ఏడాది లేక అంతకంటే ఎక్కువ కూడా కావొచ్చు. ఈ చికిత్స ఖర్చుతో కూడుకున్నది. ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్లు ఒక్కొక్కటి వేలల్లో ఉంటాయి. దీనిని దృష్టిలోపెట్టుకొని మహారాష్ట్ర ప్రభుత్వం రోగులకు ఊరట కలిగించే ప్రకటన చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా జీబీఎస్ చికిత్స అందిస్తామని రాష్ట్ర ఆర్థిక మంత్రి అజిత్ పవార్ వెల్లడించారు.

# కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు

- ఇప్పటి వరకు 9మందిని అరెస్టు చేసిన పోలీసులు




**హైదరాబాద్,జనవరి27( వెలుతురు):**
తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేపిన కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఎల్బీనగర్ వేదికగా అలకనంద హాస్పిటల్‌లో గుట్టుగా సాగుతున్న కిడ్నీ మార్పిడి రాకెట్ గుట్టు తేల్చారు పోలీసులు. ఈ కేసులో ఇప్పటివరకు 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో చాలామంది డాక్టర్లు కూడా ఉన్నారు. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇక్కడ ఎలాంటి ఇన్కమ్ లేకపోవడంతో కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ చేసి డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ అవినాష్, డాక్టర్ సుమంత్ ఇద్దరూ కలిసి భారీగా కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్లు చేశారు. మొదట డా. అవినాష్ సైదాబాద్‌లో జననీ హాస్పిటల్‌ను స్థాపించాడు. అందులో ఆయనకి ఆశించినంత సక్సెస్ రాకపోవడంతో 2022లో హాస్పిటల్ మూసేశాడు. తర్వాత డాక్టర్ సుమంత్ పరిచయం కావడంతో ఇద్దరు కలిసి సరూర్‌నగర్‌లో అలకనంద హాస్పిటల్ స్థాపించారు. ఈ హాస్పిటల్‌లో గుట్టు చప్పుడు కాకుండా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించేవారు. ఆరు నెలల వ్యవధిలో సుమారు 20కి పైగా కిడ్నీ ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్ల నిర్వహణ కోసం ఇతర రాష్ట్రాల నుంచి సర్జరీ నిర్వహించే డాక్టర్లను అలకనంద హాస్పిటల్‌కు రప్పించారు.. సర్జరీ చేసే వైద్యుల్లో కీలకంగా తమిళనాడుకు చెందిన డాక్టర్ రాజశేఖర్‌తో పాటు జమ్ము కాశ్మీర్‌కు చెందిన డాక్టర్ సాహెబ్ ఉన్నారు. కిడ్నీలను డొనేట్ చేసేందుకు ఎక్కువగా పేద కుటుంబానికి చెందిన వారే ఆసక్తి చూపిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కిడ్నీ అమ్మితే లక్షల రూపాయలు వస్తాయని ఆశపడి ఎలాంటి నిబంధనలు లేకున్నా సరే ఈ తరహాలో ప్లాన్ చేస్తున్నారు. ఒక్కో కిడ్నీ ఆపరేషన్‌కు దళారులు 60 లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. వీటిలో కిడ్నీ డొనేట్ చేస్తున్న వ్యక్తికి కేవలం 5 లక్షల రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. కిడ్నీ ఆపరేషన్ చేసిన వైద్యుడికి ఒక్కో డాక్టర్‌కు 10 లక్షల రూపాయల చొప్పున ఇస్తున్నారు. మధ్యవర్తులు, ఏజెంట్లకి ఒక్కో ఆపరేషన్‌కు 30 వేల రూపాయలు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 15 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. వీరిలో మరో ఆరుగురు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. మెయిన్ సర్జరీ చేసిన ఇతర డాక్టర్ల కోసం రాచకొండ పోలీసులు గాలిస్తున్నారు. వీరిని పట్టుకునేందుకు చెన్నైతోపాటు జమ్ము కాశ్మీర్ కు ఎస్ఓటి బృందాలు వెళ్లినట్టు సమాచారం.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

- మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ మంజూరు
- 10 నెలలు జైలులో గడిపిన తిరుపతన్న



**హైదరాబాద్,జనవరి27( వెలుతురు):**
తెలంగాణలో అత్యంత సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నాళ్లు అరెస్ట్‌లు, దర్యాప్తులు, విచారణల తర్వాత- ఈ కేసులో ఫస్ట్ బెయిల్ వచ్చింది. మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ లభించింది. షరతులతో కూడిన బెయిల్ ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది. ట్యాపింగ్ కేసులో 10 నెలలుగా జైల్లో గడిపారు మాజీ పోలీస్ అధికారి తిరుపతన్న బెయిల్ అనంతరం విడుదల కానున్నారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని మాజీ ఏఎస్పీ తిరుపతన్నపై ఆరోపణలు ఉన్నాయి. ఆధారాలు చెరిపేయడంలోనూ ఆయనదే కీలక పాత్ర అనే అభియోగాలు కూడా ఉన్నాయి. 2023 డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేసిట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో అరెస్టైన తిరుపతన్న పది నెలలుగా జైలులో ఉండగా.. తాజాగా ఆయనకు బెయిల్ ఇచ్చింది సుప్రీం కోర్ట్. వాస్తవానికి ఫోన్ ట్యాపింగ్ కేస్ లో అరెస్ట్ అయ్యిన వారిలో మొదటి వ్యక్తి తిరుపతన్న.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నలుగురిని గత ఏడాదిలో హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.. అడిషనల్ ఎస్పీ ప్రణీత్ రావ్, అడిషనల్ ఎస్పీ భుజంగ రావ్, అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావ్ లను పోలీసులు అరెస్ట్ చేసారు. దాదాపు 10 నెలలకు పైగా జైల్ లోనే ఉన్నారు. బయటికి వచ్చేందుకు అనేక సార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ రిజెక్ట్ అవుతూ వచ్చాయి. హైకోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ ఇక్కడ ఊరట లభించలేదు. తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించగా అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తిరుపతన్నను గత ఏడాది 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అదే సమయంలో మరో అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఉన్న సైతం పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ అనేకసార్లు లోయర్ కోర్టుతో పాటు హైకోర్టులోను బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు ఎవరికీ పూర్తిస్థాయిలో బెయిల్ మంజూరు కాలేదు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగింది. రాజకీయ ప్రత్యర్థులు, హైకోర్టు జడ్జిలు, జర్నలిస్టుల ఫోన్లను ట్యాప్ చేసినట్టు పోలీసులు ఆరోపణలు మోపారు.. వీటికి సంబంధించి కోర్టులో ఇంకా కేసులు నడుస్తూనే ఉన్నాయి. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ పొందిన మొదటి వ్యక్తి తిరుపతన్న.. సుప్రీం కోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదల కానున్నారు.

# మీ పథకాలకు మీరు ఏమైనా పేర్లు పెట్టుకోండి..

- కానీ కేంద్ర పథకాల పేర్లు మార్చితే ఊరుకోం
- కేంద్రం ఇచ్చే పథకాలకు ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టరు
- ప్రజలను మాయచేస్తున్న రేవంత్‌రెడ్డి - బండిసంజయ్



**హైదరాబాద్,జనవరి27( వెలుతురు):**
మీ పథకాలకు ఏమైనా పేర్లు పెట్టుకోండి.. కానీ కేంద్ర పథకాలకు పేర్లు మార్చితే ఊరుకోమని కేంద్ర మంత్రి బండిసంజయ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తుందన్నారు. పరిస్థితి అంత వరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ తాము అన్యాయం చేయబోమని స్పష్టం చేశారు. ప్రజలందరికీ ఉచితంగా బియ్యం కేంద్రమే ఇస్తోంది కదా... గరీబ్ కళ్యాణ్ యోజన అని పేరు పెడితే తప్పేంది? ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరు అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చయ్యే సంక్షేమ పథకాలకు ఎవరి పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని.. కాంగ్రెస్‌కు నచ్చితే ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం పేర్లు పెట్టుకున్నా అభ్యంతరం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసిందని తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అని స్పష్టం చేశారు. రైతు భరోసా, కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, వీధి దీపాలు, రోడ్ల పైసలన్నీ కేంద్ర ప్రభుత్వానివే అని చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనేలేదన్నారు. "మండలానికి ఒక గ్రామంలోనే నాలుగు పథకాలకు ఎంపిక చేసి లబ్ది చేయడమేంది? మిగిలిన గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేయలేదా? రాష్ట్ర ప్రజలకు ఇంత దుర్మార్గంగా చీటింగ్ చేస్తారా? రాష్ట్ర ప్రజలందరికీ లబ్ది చేకూరుస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామానికి లబ్ది చేకూర్చడం నీచం. కాంగ్రెస్ నేతల జేబుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నారా? లేక పాకిస్తాన్..బంగ్లాదేశ్ నుంచి తెచ్చి ఖర్చు చేస్తున్నారా? ప్రజలు కట్టిన పన్నులతోనే కేంద్రమైనా, రాష్ట్రమైనా ఖర్చు చేస్తోంది కదా? గతంలో పీఎం ఆవాస్ యోజన పేరుతో 2 లక్షల 40 వేల ఇండ్లను కేంద్రం మంజూరు చేస్తే... కేసీఆర్ ఒక్క ఇల్లు కట్టకుండా ప్రజలను రోడ్డున పడేసింది నిజం కాదా? డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసింది నిజం కాదా?" అంటూ ప్రశ్నలు కురిపించారు. పద్మ అవార్డుల జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని హితవుపలికారు. గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డులిస్తామని ప్రశ్నించారు. ఎంత మంది బీజేపీ కార్యకర్తలను మట్టు పెట్టారో తెలియదా అని అన్నారు. వందల మంది బీజేపీ కార్యకర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తే... నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో... ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైందని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

# సూర్యాపేటలో మరో పరువు హత్య




**సూర్యాపేట,జనవరి27( వెలుతురు):**
సూర్యాపేటలోని మామిల్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి హత్యకు హత్యకు గురయ్యాడు. పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాలవ కట్టపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిల్లల మర్రికి చెందిన నవీన్, కృష్ణ స్నేహితులు. తరచూ పిల్లలమర్రిలోని నవీన్ ఇంటికి వస్తూ పోతున్న కృష్ణ నవీన్ సోదరి భార్గవిని ప్రేమించాడు. వీరి ప్రేమను భార్గవి తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఆరు నెలల క్రితం భార్గవిని కృష్ణ కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్గవి, కృష్ణ ఇద్దరూ సూర్యాపేటలో కాపురం పెట్టాడు. ప్రేమ పెళ్లిని నిరాకరించిన భార్గవి తల్లిదండ్రులు వారిని విడదీసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కులాంతర వివాహం చేసుకున్న బంటిపై భార్గవి సోదరుడు నవీన్ కక్ష పెంచుకున్నాడు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో మహేష్ అనే మిత్రుడి నుంచి ఫోన్ కాల్ అందుకున్న కృష్ణ భార్యకు ఫోన్ ఇచ్చి బయటకు వెళ్లాడు. రాత్రి లేట్ అయినా కృష్ణ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సూర్యాపేట జనగాం క్రాస్ రోడ్ నుండి పిల్లల మర్రికి వెళ్లే మూసి కెనాల్ కట్టపై కృష్ణ మృతదేహం పడి ఉంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కృష్ణ బంధువులు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగులు మృతుడి మెడకు ఉరి వేసి చంపినట్లు గుర్తులు కన్పిస్తున్నాయి. మృతుడి ఒంటిపై కమిలిన గాయాలున్నాయి. నిందితులను గుర్తించేందుకు పోలీసులు గాలిస్తున్నారు. భార్గవి సోదరుడు కోట్ల నవీన్ హత్యకు పాల్పడ్డట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు కృష్ణ పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ హత్యకు ప్రేమ వివాహమే కారణమా, లేక పాత కక్షలే కారణమా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# చైతన్య విద్యాసంస్థలకు భారీ షాక్

**హైదరాబాద్,జనవరి27( వెలుతురు):**




మాదాపూర్‌లోని శ్రీచైతన్య విద్యాసంస్థల సెంట్రల్ కిచెన్ లైసెన్స్‌ను ఆహార భద్రతా విభాగం అధికారులు రద్దు చేశారు. గత శుక్రవారం శ్రీచైతన్య కిచెన్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేల మందికి భోజనం తయారు చేస్తున్న వంటగదిలో పాడైపోయిన ఆహార పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 125 కిలోల గడువు తీరిన ఆహార పదార్థాలను అధికారులు సీజ్ చేశారు. బియ్యం, కూరగాయలు, పప్పుదినుసులను అపరిశుభ్ర వాతావరణంలో స్టోర్ చేస్తున్నట్టు గుర్తించారు. కిచెన్, స్టోర్ రూమ్‌లో బొద్దింకలు, ఎలుకలు తిరుగుతున్నట్టు తేల్చారు. ఈ వంటగది నుంచే గ్రేటర్ హైదరాబాద్‌లోని చైతన్య కాలేజీల హాస్టళ్లకు ఆహారం సరఫరా చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఇక్కడ వండే భోజనాన్నే హాస్టళ్లలోని వేల మంది విద్యార్థులకు రోజూ అందజేస్తున్నట్లు నిర్ధారించారు. కిచెన్ మొత్తం అపరిశుభ్రంగా ఉండడంపై ఆహార భద్రతా విభాగం అధికారులు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కిచెన్‌ను సీజ్ చేయాలని, ఫుడ్ లైసెన్స్ రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఈ మేరకు మాదాపూర్(ఖానామెట్)లోని చైతన్య విద్యాసంస్థల సెంట్రల్ కిచెన్ లైసెన్స్ రద్దు చేస్తూ ఉన్నతాధికారులు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. వంటగదిలో ఆహార తయారీని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ఉత్తర్వులు ఉల్లంఘించి ఆహారం తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రయాగ్ రాజ్‌లో అమిత్‌షాకు ఘన స్వాగతం

- స్వాగతం పలికిన సిఎం యోగి తదితరులు
- కుంభమేళాలలో స్నానమాచరించిన అమిత్ షా

**ప్రయాగ్‌రాజ్,జనవరి27( వెలుతురు):**
ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా కు భారీగా భక్తులు క్యూ కడుతున్నారు. సాధారణ ప్రజలతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు కూడా త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ కుంభమేళాలో పాల్గొన్నారు. గంగ, యమున, సరస్వతి నదీ సంగమం వద్ద పుణ్యస్నానం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, యోగా గురు బాబారామ్‌దేవ్ కూడా పుణ్యస్నానమాచరించారు. పుణ్యస్నానం కోసం ప్రత్యేక విమానంలో ప్రయాగ్‌రాజ్ చేరుకున్న అమిత్ షాకు సిఎంయోగి ఆదిత్యనాథ్, ఆయన మంత్రివర్గ సహచరులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక బిజెపి నేతలు కూడా అమిత్ షాను స్వాగతించారు. మరోవైపు జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళా వైభవోపేతంగా కొనసాగుతోంది. ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనుంది. విదేశాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో పోటెత్తున్నారు. ఈనెల 29న మౌని అమావాస్య కావడంతో 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు(అమృత స్నానం) ఆచరించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం వల్ల 12 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి లభించిందని అంచనా. తాత్కాలిక వైద్య శిబిరాలతో 1.5 లక్షల మంది నర్సులు, పారామెడికల్స్, ఇతర వైద్య సిబ్బందికి అవకాశాలు లభించాయి.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com